ప్రజాశక్తి

మంగళవారం 16 ఏప్రిల్ 2024 పేజీలు 8

విజయనగరం

పార్వతీపురం మన్యం



రాజాం ప్రజాగళం సభలో ప్రసంగిస్తున్న టిడిపి అధినేత చంద్రబాబునాయుడు; సభకు హాజరైన జనం

చంద్రబాబు సభలో జనసేనకు చోటేది?

రాజాంలో బిజెపి లేనట్టే !

ప్రజాగళంలో బయటపడ్డ కూటమి బాగోతం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / రేగిడి

పేరుకు ఎన్డీయే కూటమి. కానీ, చంద్రబాబు సభకు టిడిపి మినహా మిగిలిన రెండు పార్టీల నాయకుల ఆచూకీ కనిపించలేదు. ముఖ్యంగా జనసేన జెండాలు అక్కడక్కడా కనిపించినప్పటికీ, ఆ పార్టీకి చెందిన నాయకులను వేదికపైకి ఆహ్వానించలేదు. ఇక బిజెపి అయితే పూర్తిగా నియోజకవర్గంలో లేనట్టే లెక్క. ఎందుకంటే అక్కడ ఆ పార్టీ జెండాలు మచ్చుకు కూడా కనిపించలేదు. దీంతో, మూడు పార్టీల తరపునా చంద్రబాబు ఒక్కరే మాట్లాడేశారు. సోమవారం రాజాంలోని పాలకొండ రహదారిలో నిర్వహించిన ప్రజాగళం సభకు చంద్రబాబు హాజరయ్యారు. సభకు రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రుమురళి, విజయనగరం ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, మాజీ మంత్రి ప్రతిభా భారతి మినహా జిల్లాలోని ముఖ్యనాయకులుగానీ, కనీసం పక్కపక్కనే ఉన్న నియోజకవర్గ అభ్యర్థులుగానీ హాజరు కాకపోవడం చర్చనీయాంశగా మారింది. జనసేన జిల్లా నాయకుడు యుపి రాజు సభకు హాజరైనప్పటికీ ఆయనను వేదికపైకి ఆహ్వానించలేదు. మరోవైపు జిల్లాకు పెద్ద తలకాయగా చెప్పుకుంటున్న పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్‌గజపతిరాజు, రాజాంకు కూత వేటదూరంలోవున్న చీపురుపల్లి అసెంబ్లీ అభ్యర్థి, రాష్ట్ర పార్టీ మాజీ అధ్యక్షులు కిమిడి కళావెంకటరావు కూడా హాజరు కాకపోవడం గమనార్హం. సభకు వచ్చిన టిడిపి కార్యకర్తలను, నిరుద్యోగులను ఉత్తేజపర్చేందుకు చంద్రబాబు ప్రయత్నించారు. పెరిగిన ధరలపై సిఎం జగన్‌పై దుమ్మెతిపోసిన చంద్రబాబు గ్యాస్, పెట్రోల్, నిత్యవసర సరుకుల ధరలపైనా, (మిగతా..3లో)

నామినేషన్ల స్వీకరణకు సిద్ధంగా ఉండాలి

జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈనెల 18వ తేదీన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం అవుతుందని, దానికి తగిన ఏర్పాట్లు చేయాలని రిటర్నింగ్ అధికారులను జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, 18 న ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదలవుతుందని తెలిపారపు. ఆరోజు నుంచీ నామినేషన్లను స్వీకరణ ఉంటుందన్నారు. నామినేషన్ల దాఖలకు చివరి తేదీ 25వ తేదీ అని, 26న నామినేషన్లను పరిశీలన ఉంటుందన్నారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ 29వ తేదీ అని, మే 13వ తేదీ పోలింగ్ జరుగుతుందని తెలిపారు. నామినేషన్ల స్వీకరణలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలను వివరించారు. అభ్యర్థులు నామినేషన్ల దాఖలకు 13 రకాల డాక్యుమెంట్లను తీసుకురావాలని, అవన్నీ సక్రమంగా ఉంటేనే నామినేషన్లను అనుమతించాలని తెలిపారు. చివరి రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరించాలన్నారు. పబ్లిక్ సెలవు దినాలలో నామినేషన్ స్వీకరించబడదన్నారు. అభ్యర్థులు గరిష్టంగా 4 సెట్ల నామినేషన్ దాఖలు చేయవచ్చన్నారు. నామినేషన్ల దాఖలు సమయంలో గరిష్టంగా 3 వాహనాలు అనుమతించబడతాయని, అభ్యర్థితో పాటు ఐదుగురిని ఆర్ఒ కార్యాలయంలోకి అనుమతిస్తారని తెలిపారు. అభ్యర్థి నామినేషన్ వేసిన దగ్గర నుంచీ, ఖర్చు అతని ఖాతాలో లెక్కించడం జరుగుతుందని చెప్పారు. పత్రికల్లో వచ్చే ప్రకటనలు, పెయిడ్ న్యూస్ వార్తలను అభ్యర్థి ఖాతాలో లెక్కించడం జరుగుతుందని, ఈ అంశాన్ని వారికి వివరించాలని సూచించారు. మోడల్ కోడ్ అమలు నిబంధనలను అభ్యర్థులకు అందజేయాలని సూచించారు. వికలాంగులకు, 85 ప్లస్ వయస్సు కలిగిన వారికి హోం ఓటింగ్ కు అవకాశం ఇవ్వాలని తెలిపారు. బిఎల్ఒ సెక్టార్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఫారం-డి అందించాలని తెలిపారు. పోల్ డే రోజున ఓటర్ల కోసం కనీస సదుపాయాలను కల్పించాలని తెలిపారు. ఎన్నికల సిబ్బందికి నాణ్యమైన ఆహారాన్ని అందించాలని వేసవిని దృష్టిలో పెట్టుకొని మజ్జిగ, మంచి నీరు ఎక్కువగా అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్ఒ ఎస్.డి. అనిత, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు సందీప్ కుమార్, సుధారాణి, ఆర్వోలు పాల్గొన్నారు.

చీపురుపల్లిలో ఎన్నికల సిబ్బంది శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఉదయం 5.30కే మాక్ పోల్

జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

ప్రజాశక్తి-చీపురుపల్లి, రాజాం

పోలింగ్ రోజున ఉదయం 5.30గంటలకే మాక్ పోల్ నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. అప్పటికి ఏజెంట్లు రాకపోతే, 15 నిమిషాలు ఎదురు చూసి, వచ్చినా రాకున్నా 5.45కు మాక్ పోల్ ప్రారంభించాలని చెప్పారు. నిర్ణీత సమయానికి ఈ ప్రక్రియ ప్రారంభించాలని, దీనికోసం ఉదయం 5 గంటలకే పోలింగ్ బూత్ లో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియపై సంపూర్ణ అవగాహన కల్పించుకొని, ఒక్క తప్పు కూడా దొర్లకుండా ఈ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ, ఈవిఎంలు, వివి ప్యాట్ల పనితీరుపై పిఒలు, ఎపిఒలకు రాజాం, చీపురుపల్లి నియోజకవర్గ కేంద్రాల్లో రెండోవిడత శిక్షణను సోమవారం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ, ఇవిఎంల పనితీరు, పిఒలు, ఎపిఒల విధులు, బాధ్యతలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన వీడియోను ప్రదర్శించడం ద్వారా పూర్తి స్థాయి అవగాహన కల్పించేందుకు కృషి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ రోజున, సంబంధిత పోలింగ్ బూత్‌లో పిఒల బాధ్యత అత్యంత కీలకమని చెప్పారు. రీ పోలింగ్ కు ఎక్కడా అవకాశం ఇవ్వకూడదని, (మిగతా..3లో)

సమస్యలపై పోరాడుతున్న

సిపిఎం అభ్యర్థులను గెలిపించండి

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సుబ్బరావమ్మ

అంటి వలసలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు కె.సుబ్బరావమ్మ

ప్రజాశక్తి - కొమరాడ

బిజెపి ప్రభుత్వం కేంద్రంలోనూ రాష్ట్రంలోను ప్రజలను మోసం చేస్తున్నదని, ప్రధానంగా గిరిజనులకు, రైతులకు, కార్మికులకు, వ్యవసాయ కూలీలకు, మహిళలకు మైనార్టీలకు సంబంధించిన చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ అన్నారు. సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం దేవకొన పంచాయతీ అంటివలసలో గిరిజనులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ మౌలిక సూత్రాలను పూర్తిగా తుంగలో తొక్కుతోందన్నారు. ఏజెన్సీలో జీవో 3 ప్రకారం వంద శాతం గిరిజనులకు ఉద్యోగం ఇవ్వాల్సి ఉందని, గిరిజనులు పండించే పంటకు సంబంధించిన పంటలను జిసిసి ద్వారా పంపిణీ చేయాలని అన్నారు . అటవీ హక్కుల చట్ట ప్రకారంగా అడవులను పరిరక్షణ చేయాలని, కానీ బిజెపి ప్రభుత్వం అన్ని చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేస్తోందన్నారు. గిరిజన యూనివర్సిటీ నిర్మాణం చేయకుండా కేంద్ర ప్రభుత్వం గిరిజన విద్యార్థులతో చెలగాటమాడుతుందని మండిపడ్డారు. విభజన హామీలను నెరవేర్చలేదన్నారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం చేసిన బిజెపితో టిడిపి, జనసేన కూటమి కట్టడమంటే రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేయడమేనని అన్నారు.

లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయకుండా సొంత గనులు కేటాయించాలని పోరాటం చేస్తుంటే బిజెపి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌కు ముడి సరుకులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతూ వాటి ఆస్తులను ప్రైవేటుపరం చేస్తుందని అన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బిజెపిని ప్రతిఘటించాల్సిన టిడిపి జనసేన కుమ్మక్కై ఎన్డీఏ పేరుతో ప్రజల వద్దకు వెళ్తుండడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. అందుకే టిడిపి, జనసేన పార్టీలను ఓడించాలని అన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి రాష్ట్ర ప్రయోజనాల కన్నా ఈ ఐదేళ్లలో బిజెపి ప్రయోజనాలనే కంటికి రెప్పలా కాపాడుతూ పాలన సాగించారన్నారు. బిజెపి ఎజెండాను తూచా తప్పకుండా జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తూ పరోక్షంగా బిజెపికి మద్దతు తెలుపుతుందని, కాబట్టి వైసిపిని కూడా ఓడించాలని పిలుపునిచ్చారు. సిపిఎం, సిపిఐ కాంగ్రెస్ ఒక నిర్దిష్టమైన (మిగతా..3లో)

కార్యదర్శిపై విచారణకు ఆదేశం

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని గునుపూరుపేట పంచాయతీ కార్యదర్శి బి. లక్ష్మణరావు ఎన్నికల కోడ్ ఉల్లంఘించి బిఎస్‌పి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంపై ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి స్పందించిన ఆర్‌ఒ కార్యదర్శిపై సోమవారం విచారణకు ఆదేశించారు. విచారణ చేసి వెంటనే నివేదకు తనకు అందించాలని ఎంపిడిఒకు ఆదేశించారు. విచారణ అధికారిగా ఇఒపిఆర్‌డి శంకర్ జగన్నాథంను వేశారు. ఆయన గ్రామ కార్యదర్శికి నోటీస్ ఇచ్చి వివరణ కోరారు. అనంతరం గునుపూరుపేటలో విచారణ చేపట్టారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు ఇస్తామని ఆయన స్పష్టం చేశారు.

96 మంది వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలో బొప్పడాం, చంద్రంపేట, గుషిణి, జోగిరాజు పేట, కొండ గుంపాం, మొయిద, ఒమ్మి, రామతీర్థం, సతివాడ, వల్లూరు గ్రామాలకు చెందిన 96 మంది వాలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలు ఎంపిడిఒకు అందజేసినట్లు కార్యాలయం సిబ్బంది తెలిపారు. దీంతో బాటు నగర పంచాయతీకి చెందిన వార్డు వాలంటీర్లు రాజీనామాలు అందజేశారు.

మెరక ముడిదాం: మండలంలోని బైరిపురం సచివాలయ పరిధిలో 7గురు వాలంటీర్లు తమ విధులకు రాజీనామా చేసినట్లు సెక్రటరీ దామోదర్ తెలిపారు. రాజీనామా చేసిన వాలంటీర్లు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ చంద్రబాబు మాటలకు మనస్థాపానికి గురై రాజీనామాలు చేశామన్నారు.

భోగాపురం: మండలంలోని మూడు సచివాలయాల పరిధిలో 56 మంది వాలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. భోగాపురం సచివాలయం పరిధిలో 56 మంది వాలంటీర్లు ఉండగా ఇందులో 25 మంది మాత్రమే రాజీనామా చేశారు. పోలిపల్లి సచివాలయం పరిధిలో 16 మంది, ముక్కాం సచివాలయం పరిధిలో 15 మంది వాలంటీర్లు రాజీనామాలు చేశారు. తమ రాజీనామా పత్రాలను ఆయా పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు.

నేడు ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి- విజయనగరం

స్థానిక శ్రీసాయి సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిలో మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నామని ఆ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ఎ. శ్రీరామ్మూర్తి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఈ శిబిరం నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ శిబిరంలో ఉచిత కన్సల్టేషన్, ఎక్స్‌రే, రక్తపరీక్షలు, వైద్య పరీక్షలు నిర్వహిస్తామని ఈ అవకాశాన్ని రోగులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

నేడు రాజా కళాశాలలో ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక రాజా కళాశాలలో మంగళవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సిహెచ్ వీరేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సింధు హాస్పిటల్స్, హెటిరో సంస్థలు ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు జరుగుతాయని చెప్పారు. 2020-21, 2021-22, 2022-23, 2023-24లో డిగ్రీ బిఎస్సి కెమిస్ట్రీ, బిఎ, బికామ్, ఎమ్మెస్సి కెమిస్ట్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పూర్తి వివరాలు, సర్టిఫికేట్స్, ఆధార్, పాస్ పోర్టు సైజ్ ఫోటోలతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు.

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి నుంచి కలప అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుంది. కలప అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అటవీశాఖ అధికారులు మామూళ్ల మత్తులో ఉన్నారు. కలప అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లను ప్రశ్నించగా అధికారులకు డబ్బులు ఇచ్చినట్లు చెప్పడం విశేషం. రైతులు అవసరాలకు చెట్లు కొడితే అభ్యంతరం చేస్తున్న అటవీశాఖ అధికారులు వ్యాపారులను ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి కలప అక్రమ రవాణాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాక్టర్ల ద్వారా తరలిపోతున్న కలప

ఉపాధి కూలీల ధర్నా

ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి- కొత్తవలస

తమకు గిట్టుబాటు కూలి కల్పించాలని కోరుతూ ఉపాధి కూలీలు సోమవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గొర్లె శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు అరకొర, చాలీచాలని వేతనాలు పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కొక్క కార్మికుడికి రోజు కూలి 51 రూపాయలు, మరికొన్ని గ్రూపులకు రూ.81, రూ.91 రూ.101 వస్తుంటే కుటుంబాలను ఎలా పోషించాలని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు రోజు కూలి రూ.300 తగ్గకున్నా ఇవ్వాలని ప్రకటన చేసిందని, ఈ ప్రకటనలు కాగితాలకు మాత్రమే పరిమితమయ్యాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేయడానికి వేస్తున్న కుట్రాలోభాగమే నని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకపోవడం వలన నిరుద్యోగులకు వేరే ఉపాధి లేక ఉపాధి హామీ పనులకు కూలీలుగా మారుతున్నార న్నారు. సిపిఎం పాలిస్తున్న కేరళ రాష్ట్రంలో ఉపాధి కూలీకి రోజుకు రూ. 400 ఇస్తుందని, అలాగే మన రాష్ట్రంలో కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులు సంవత్సరంలో ఒక్కొక్క జాబ్ కార్డుకి 200 రోజులు పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉపాధి కూలీలకు పాత పద్ధతి మాదిరిగానే పనులు చేపట్టాలని 20 మందికి ఒక గ్రూపు ఏర్పాటు చేయాలని, పని ప్రదేశాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, పనిముట్లకు అదనపు అలవెన్స్ ఇవ్వాలని, సమ్మర్ అలవన్స్ ఇవ్వాలని కోరారు. మండుతున్న ఎండలను గమనించి మజ్జిగ సరఫరా చేయాలని, చేసిన పనికి పే స్లిప్పులు ఇవ్వాలని, ప్రతి గ్రూప్‌కి టెంట్లు గుణపాలు పారలు ప్రభుత్వ సరఫరా చేయాలనీ డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ఎక్కువ కేటాయించి ఉపాధి హామీ చట్టంలో నిధులను దారి మళ్లించుకున్న చేయాలని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రామకృష్ణ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి - గజపతినగరం

గజపతినగరం: కరపత్రాలను పంపిణీ చేస్తున్న సిబ్బంది

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎంఎస్‌వి రవి ప్రసాద్ రైల్వే స్టేషన్, ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. నాలుగు రోడ్ల జంక్షన్ వంటి ప్రధానమైన ప్రదేశాలలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఏ విధంగా స్పందించాలి, మంటలను ఏ విధంగా అదుపు చేయాలి అనే వాటిపై ప్రయోగాత్మకంగా అగ్నిమాపక సాధనాలతో అవగాహన వచ్చే విధంగా అందరికీ చేసి చూపించారు. అనంతరం కరపత్రాలను పంచారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

శృంగవరపుకోట: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని పట్టణంలోని అగ్నిమాపక దళ శాఖాధికారి షేక్ మదీనా అన్నారు. రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ జాతీయ అగ్రిమాపక వారోత్సవాలులో భాగంగా రెండవ రోజు పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో డిపో మేనేజర్ కె రమేష్ ఆధ్వర్యంలో ఆర్‌టిసి సిబ్బందికి, ప్రయాణికులకు అగ్నిప్రమాదాలు సంభవించునపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, నివారణ పద్ధతులు గురించి వివరించారు. ఫైర్ డ్రిల్స్ నిర్వహించి అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ కోట ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామాలయానికి తలంబ్రాలు అందజేత

ప్రజాశక్తి - నెల్లిమర్ల

తలంబ్రాలను అర్చకులకు అందిస్తున్న సంఘం ప్రతినిధులు

ఈ నెల 17న శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణం పురస్కరించుకొని కళ్యాణార్థం నిర్వహించే శ్రీ రామతీర్థం సేవా సంఘం ఆధ్వర్యంలో గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను సోమవారం శ్రీరామునికి సమర్పించారు. ఈ సంవత్సరం కూడా ఈ సంఘం ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే కాకుండా తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన రామభక్తులకు ఈ తలంబ్రాలను పంపించారు. ఆ ధాన్యాన్ని భక్తులు శ్రీ రామనామం జపిస్తూ గోటితో ఒలుస్తూ అవి తలంబ్రాలుగా సిద్ధం చేసి సంఘ ప్రతినిధులకు అందజేశారు. దుప్పాడ, నెల్లిమర్ల, తంగుడుబిల్లి గ్రామాలకు చెందిన యాత్రికలు తయారు చేసిన తలంబ్రాలను, భీమవరానికి చెందిన మునకాల గోవింద రావు పంపిన కంత (మధుర పదార్ధము)ను రామతీర్థంలోని రామచంద్రస్వామికి మేళతాళాలతో, భజనలతో, కోలాటాలతో కోలాహలంగా ఊరేగింపుగా తీసుకుని వచ్చి దేవస్థానం కార్యనిర్వహణాధికారి, సహాయ కమీషనర్ వై శ్రీనివాసరావుకి సంఘం ప్రతినిధులు, అర్చకస్వాముల సమక్షంలో సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, యాత్రికలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి: మాట్లాడుతున్న ఆర్‌ఒ సాయిశ్రీ

ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. సాయిశ్రీ అన్నారు. గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ పాఠశాలలో జరుగుతున్న పిఒ, ఎపిఒ శిక్షణలో ఆమె మాట్లాడారు. జాగ్రత్తలు పాటిస్తే ఎన్నికలు విజయవంతంగా నిర్వహించవచునన్నారు. ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహశీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పగడ్బందీ చర్యలు

గజపతినగరం: త్వరలో జరగనున్న ఎన్నికల నిర్వహణకు పగడ్బందీగా చర్యలు చేపట్టనున్నట్లు విజయనగరం ఆర్‌డిఒ, నియోజవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిని ఎం.వి. సూర్యకళ అన్నారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, ఇప్పటికే ఎన్నికల ప్రక్రియకు సంబంధించి పనులు క్రమంగా చేపడుతున్నామన్నారు. సెక్టోరియల్ ఆఫీసర్స్, పిఒలు, ఎపిఒలకు ఇప్పటికే రెండు విడుదలగా శిక్షణా తరగతులు నిర్వహించామన్నారు. ఈనెల 18వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ చేపడతామన్నారు. 26న నామినేషన్ల స్క్రూటినీ ఉంటుందన్నారు. 29వరకు నామినేషన్ ఉపసంహారణకు గడువు ఉంటుందన్నారు. అభ్యర్థులు నాలుగు సెట్ల అప్లికేషన్లు దాఖలు చేయవచ్చన్నారు. నామినేషన్ల దరఖాస్తులకు సంబంధించి ఎటువంటి సందేహాలున్నా తహశీల్దార్ కార్యాలయంలో గల హెల్ప్ డెస్క్‌కు వచ్చి నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి రెండు కేసులు ఇప్పటివరకు నమోదు చేసినట్లు తెలిపారు. వికలాంగులు, 85 సంవత్సరాల దాటిన ఓటర్ల ఇంటికి వెళ్లి ఓటు వేయించే సౌకర్యం కల్పించినట్లు అన్నారు. ఇందుకు సంబంధించిన సిబ్బందిని కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు కావలసిన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించి ప్రక్రియ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ పి రమేష్, ఉప తహశీల్దార్ సత్యనారాయణ పాల్గొన్నారు.

19న కౌన్సిలింగ్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మిగులు సీట్లు భర్తీకి ఈ నెల 19న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.ఉషారాణి తెలిపారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 2024-2025 విద్యా సంవతరంకి 5వ తరగతి ప్రవేశానికి ప్రవేశ పరీక్ష రాసి ఎంపిక కాబడిన విద్యార్థులకు మొదటి లిస్టులో సీట్లు కేటాయించగా ఇంకను మిగిలి ఉన్న సీట్లకు ఎంట్రెన్స్ పరీక్ష రాసిన విద్యార్థినులకు మెరిట్ లిస్టు ప్రకారం మిగులు సీట్లు కేటాయిస్తామన్నారు. ఈ నెల 19 న చీపురుపల్లి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల యందు ఉదయం 10 గంటల నుండి కౌన్సిలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తామని చెప్పారు. కౌన్సెలింగ్‌కి విద్యార్థిని తమ ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ, ఆదాయ ధృవీకరణపత్రం, స్టడీస్ సర్టిఫికెట్స్‌తో చీపురుపల్లి పాఠశాలకు ఉదయం 9.గంటలకు హాజరు కావాలని ఆమె తెలిపారు.

ఉపకరణాల ఎంపిక శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - రామభద్రపురం

స్థానిక భవిత కేంద్రంలో సోమవారం బొబ్బిలి నియోజకవర్గ స్థాయిలో వికలాంగ చిన్నారులకు ఉపకరణాల ఎంపికకు నిర్వహించిన నిర్ధారణ శిబిరానికి విశేష స్పందన లభించింది. బొబ్బిలి, తెర్లాం, బాడంగి, రామభద్రపురం మండలాలకు చెందిన 18 ఏళ్లలోపు వికలాంగులు 150 మందికి పైగా ఈ శిబిరానికి హాజరయ్యారు. వీరికి సరిపడా ఉపకరణాలైన వీల్ చైర్లు, రోలేటర్స్, ట్రైసైకిల్, ఎంఆర్ కిట్లకు ఆర్థో వైద్యులు నాగిరెడ్డి రవిశంకర్, ఇఎన్‌టి వైద్యులు హిప్సిబా తనిఖీలు చేసి అర్హతలు నమోదు చేసి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా సహిత విద్యా సమన్వయకర్త సూర్యారావు, ఎంఇఒ తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ విరలాంగులైన చిన్నారులకు సమగ్రశిక్షలో విద్యతో పాటు ఎస్కార్ట్ రవాణా, స్టైఫండు, ఇంటి వద్దనే విద్య, రీడర్ అలవెన్స్ ఇవ్వటంతో పాటు అలెమ్కో కాన్పూర్ వారిచే ఉపకరణాలను ప్రతీ ఏడాది అందించటం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు కొల్లి ఈశ్వరరావు, సునీల్, పాపారావు, కళావతి, శ్రీను, ఐఇఆర్‌టిలు చింతల రాజేశ్వరి, రవి, తేజస్వని, సూర్య, సత్య, సరిత పాల్గొన్నారు.

శిబిరాన్ని పరిశీలిస్తున్న సూర్యారావు, తిరుమల ప్రసాద్

మొదటిపేజీ తరువాయి

సభలో మాట్లాడుతున్న ఎంపి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు

చంద్రబాబు సభలో జనసేనకు చోటేది?

పట్టణ ప్రాంతాల్లో చెత్తపన్ను, విలువ ఆధారిత పన్ను వంటివాటి గురించి మాత్రం కనీస ప్రస్తావన చేయకపోవడం గమనార్హం. ముఖ్యంగా రాష్ట్ర విభజన సందర్భంగా జిల్లాకు, ఉత్తరాంధ్రకు ఇచ్చిన హామీల గురించి ఎందుకు మాట్లాడడం లేదో అంటూ పలువురి సభికుల నోట వినిపించింది.

రాజాం నియోజకవర్గంలోని ఇసుక, తదితర వనరులను జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు దోచుకుంటున్నారని చంద్రబాబు విమర్శించారు. ప్రతిదానికి సెటిల్‌మెంట్లు చేసి 5శాతం నుంచి 10శాతం వసూలు చేసుకుంటున్నారని అన్నారు. అందుకే కంబాల జోగులు ప్రజావిస్వాసాన్ని కోల్పోయారని, దీంతో, పాయకరావుపేటకు ట్రాన్స్‌ఫర్ చేశారని విమర్శించారు. జగన్ ప్రభుత్వం నియమించిన వార్డు, గ్రామ వాలంటీర్లకు రూ.10వేతనం అందజేస్తామని, అదే ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లను కూడా పూర్తిచేసేందుకు సహకరిస్తాం అంటూ చంద్రబాబు చెప్పడం పట్ల సర్వత్ర చర్చ నడిచింది. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డిఎస్‌సి కోసం సంతకం చేస్తానని, సంపద సృష్టించి పేదరికాన్ని రూపుమాపేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. వైసిపిది విధ్వంస రాజ్యమని, తమది సంక్షేమ రాజ్యమని అన్నారు. నాడు ప్రశాంతమైన ఉత్తరాంధ్ర నేడు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్తోందన్నారు. కూటమి ఇచ్చే పథకాలతో లాభపడతారా, జగన్ ఇచ్చే పథకాలతో లాభపడతారా ప్రతి ఒక్కరూ ఆలోచించుకోవాలన్నారు. వైసిపి ప్రభుత్వం ఉత్తరాంధ్రలోని సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేసిందన్నారు. తాను కష్టాల్లో ఉన్నప్పుడు నా కుటుంబానికి ప్రజలు అండగా నిలిచారని, మరోసారి అధికారం ఇస్తే ప్రజల రుణం తీర్చుకుంటానని అన్నారు. సభలో ఎంపి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రమురళి, మాజీమంత్రి ప్రతిభా భారతి, తదితరులు పాల్గొన్నారు.

రాజాంకు చంద్రబాబు హామీల వర్షం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం సాధిస్తే రాజాం అభివద్ధికి పెద్ద పేట వేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. రాజాంకు ఔటర్ రింగ్ రోడ్ ఏర్పాటు చేస్తామని, మూతబడిన పరిశ్రమలు తెరిపించేందుకు చర్యలు తీసుకుంటానని అన్నారు. అర్హత ఉన్న ప్రతి పేదవానికి రెండు సెంట్లు స్థలము ఇచ్చి ఇల్లు కట్టించేందుకు కషి చేస్తామన్నారు.. పాలకొండ రోడ్డును సెంటర్ లైటింగ్‌తో చూడముచ్చటగా తీర్చిదిద్దుతానన్నారు. రాజాంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కంచరాం వద్ద టిక్కో కాలనీలు నిర్మించిన ఇళ్లను పేదలకు పంపిణీ చేస్తామన్నారు.

ఉదయం 5.30కే మాక్ పోల్

(మొదటిపేజీ తరువాయి)

ఎట్టి పరిస్థితి లోనూ తప్పులు, పొరపాట్లు జరగకూడదని స్పష్టం చేశారు. మూడో విడత శిక్షణా కార్యక్రమాన్ని మే మొదటి వారంలో నిర్వహిస్తామన్నారు. మాక్ పోల్ పూర్తి అయిన వెంటనే, వివి ప్యాట్ లను ఖాళీ చేయాలని, ఇవిఎంలను రీసెట్ చేసిన తరువాతనే పోలింగ్ ను ప్రారంభించాలని చెప్పారు. నిర్ణీత సమయం ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభించాలని, ఉదయం నుంచే వీలైనంత వరకు వేగంగా పోలింగ్ ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. పీఓలు ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఉన్నది ఉన్నట్లు ఖచ్చితంగా అమలుచేయాలని ఆదేశించారు. పోలింగ్ ఏజెంట్లుగా వాలంటీర్లు ఉండకూడదని స్పష్టం చేశారు. రాజీనామా చేసిన వాలంటీర్లు గురించి బిఎల్‌ఒలు, లేదా ఎంపిడిఒ ధ్రువీకరించిన తరువాత ఏజెంట్లుగా అనుమతించ వచ్చునని సూచించారు. ఏజెంట్లు తప్పనిసరిగా ఆ నియోజకవర్గానికి చెందిన ఓటర్ అయ్యిఉండాలని స్పష్టం చేశారు. సర్పంచులు, వార్డు మెంబర్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు కూడా ఏజెంట్లుగా ఉండవచ్చునని తెలిపారు. కార్యక్రమాల్లో రాజాం ఆర్‌ఒ జోసెఫ్, ఆయా మండలాల ఎఆర్‌ఒలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఎం అభ్యర్థులను గెలిపించండి

అవగాహనతో ఇండియా వేడికగా ఏర్పడి పోటీ చేస్తున్నాయని తెలిపారు. అరకు పార్లమెంట్ స్థానం నుంచి ఎంపిగా పోటీ చేస్తున్న అప్పలనర్స, కురుపాం నుంచి పోటీ చేస్తున్న మండంగి రమణను గెలిపించాలని కోరారు. వీరిద్దరూ ప్రజల తరపున పోరాడుతున్నారని తెలిపారు. గిరిజన, పేద మధ్య తరగతి ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడే సిపిఎం అభ్యర్థులను ప్రజలు గుర్తించాలని కోరారు. ఈనెల 19న ఎంపి అభ్యర్థి అప్పలనర్స పార్వతీపురం లోను, 23న మండంగి రమణ కురుపాంలోను నామినేషన్లు వేయనున్నారని, ప్రజలంతా పెద్ద ఎత్తున కదలి రావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి.ఇందిర, కె.సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు గంగరాజు వెంకటేశు బలరాం చిన్నారావు సన్యాసిరావు, మహిళలు పాల్గొన్నారు.

సాయిపద్మ హఠాన్మరణం

లయన్స్ సేవా సంస్థల ద్వారా పలు కార్యక్రమాలు

ప్రజాశకి-గజపతినగరం

ప్రముఖ వైద్యులు కీర్తిశేషులు బిఎస్‌ఆర్ మూర్తి పెద్ద కుమార్తె సాయి పద్మ (52) సోమవారం ఆకస్మాతుగా మృతి చెందారు. ఉదయం ఒక్కసారిగా కుప్పకూలిపోయిన ఆమెను కుటుంబ సభ్యులు విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆమె మృతి మండల వాసులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. సాయిపద్మ తండ్రి డాక్టర్ బిఎస్‌ఆర్ మూర్తి కొద్ది రోజుల క్రితం మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె సోదరుడు డాక్టర్ నాగ నరేంద్ర కూడా అనారోగ్యంతో కొద్దికాలం క్రితం చనిపోయారు. ఈనేపథ్యంలో ఆమె తీవ్ర మనోవేదనకు గురయ్యారని తెలిసింది. పద్మ చిన్నతనం నుంచి చదువులో ముందుండేవారు. పోలియోవల్ల వికలాంగురాలైన సాయిపద్మ జీవితం కాలం వీల్‌చైర్‌కే పరిమితమయ్యారు. పేదలకు సేవలందించడంలో ముందుండేవారు. న్యాయవాదిగా, రచయితగా, రీడర్‌గా, సింగర్‌గా ఆమె పేరొందారు. బడుగుల జీవితాలకే తన జీవితం అంకితమంటూ 'గ్లోబల్ ఎయిడ్' అనే సంస్థను ఏర్పాటు చేసి ద్వాని ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆమె మృతితో గజపతినగరంలో విషాదం అలముకుంది. ఆమె మృతికి ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, పలువురు టిడిపి నాయకులు సంతాపం తెలిపారు.

నీతివంతమైన పాలన అందించాం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నీతివంతమైన, ప్రజా రంజకపాలన అందించిన వైసిపిని మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. ఇంటింటి ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం పూల్ బాగ్ వ్యాసనా రాయణ మెట్ట ప్రాంతం నుంచి ప్రచారాన్ని ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో తాము చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి ఎన్నో ఏళ్లుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్న ప్రజలకు వాటర్ ట్యాంకుల నిర్మాణాన్ని చేపట్టి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చేశారని అన్నారు. నగరంలో 11వాటర్ ట్యాంకులు నిర్మించి అన్ని ప్రాంతాలకు దాహార్తిని తీర్చగలిగారన్నారు. కార్యక్రమంలో ఫ్లోర్‌లీడర్ ఎస్ వివి రాజేష్, కార్పొరేటర్ బండారు ఆనందబాబు, మూడో డివిజన్ పార్టీ ఇన్‌ఛార్జి వేముల రాంప్రసాద్, 3వ డివిజన్ యువజన విభాగం అధ్యక్షులు నైదాన సతీష్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ పక్షపాతి అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దేశంలో మహిళలకు సమాన హక్కులు, రిజర్వేషన్లు కల్పించిన స్త్రీ జనోద్ధారకుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోగిశ రామకృష్ణ అన్నారు. సోమవారం ఉదయం కంటోన్మెంట్ రెల్లివీధి లో జరిగిన అంబేద్కర్ జయంతి సభలో అయన మాట్లాడారు. మహిళలకు రాజ్యాంగం ద్వారా విద్యలోను, ఉద్యోగాల్లోను, రాజకీయాల్లోను రిజర్వేషన్లు ఇచ్చి వారికి ఉన్నత అవకాశాలు కల్పించిన ఘనత అంబేద్కర్‌కే దక్కిందన్నారు. రెల్లి మహిళా సంఘం అధ్యక్షురాలు నీలాపు దేవి మాట్లాడుతూ జిల్లాలో రెల్లి మహిళలు అందరు తమ పిల్లలను బడికి పంపించి బాగా చదివించాలని అంబేద్కర్ ఇచ్చిన అవకాశాలను అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చోళ్ల రాజకుమారి, బంగారి శ్యామల, సోమాదుల ఊహ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలని వన్‌టౌన్ సిఐ బి.వెంకటరావు కోరారు. సోమవారం నగరంలోని బొడ్డువారి జంక్షన్ నుండి కొత్తదేవర వీధి, అరకాల గెడ్డ మీదుగా నాగవంశం వీధి వరకు ఎస్‌క్మిలు నవీన్ పడాల్, తారకేశ్వరరావు, వన్ టౌన్ పోలీసు సిబ్బంది, కేంద్ర పోలీసు బలగాలు సుమారు 4 కిలోమీటర్లు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు, శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని, ఎన్నికల నిబంధనలు పాటించాలని, తగాదాలకు దూరంగా ఉండాలని కోరారు.

ఇవిఎంల తరలింపును పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు స్ట్రాంగ్ రూంలో భద్రపర్చిన ఇవిఎంలు, వివిప్యాడ్‌లను నియోజక వర్గాలకు తరలింపును కలెక్టర్ నిశాంత్ కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇవిఎంల భద్రతా గోడౌన్‌ను వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో వాహనంలో ఇవిఎంలను తరలించారు. ఇప్పటికే తొలి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిందన్నారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో పార్లమెంట్, నియోజక వర్గ ఇవిఎం, వివి ప్యాట్‌లపై నియోజక వర్గంలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఇన్చార్జి డిఆర్‌ఒ జి.కేశవ నాయుడు, తహశీల్దార్ కె.ఆనందరావు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి అభ్యర్థి అదితి విజయలక్ష్మి

గ్రామాల్లో అదితి ప్రచారం

ప్రజాశక్తి-విజయనగరం కోట

మండలంలోని కొండకరకాం, బియ్యాలపేట గ్రామాల్లో టిడిపి అభ్యర్థి పి.అదితి విజయలక్ష్మి గజపతి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను కలిసి తనను గెలిపించాలని కోరారు. జగన్ ఒక్క ఛాన్స్ అని చెప్పి ప్రజలను నిండా ముంచారని, ఐదేళ్లలో ఒక్క అభివృద్ధి పని చేయలేదని, వైసిపి నాయకులు కేవలం షో చేసి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని అన్నారు. చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం అన్నిరంగాలలో అభివృద్ధి పథంలో వెళ్తుందని, సూపర్ సిక్స్ హామీల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు. పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, వేచలపు శ్రీనివాసరావు కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, పట్టణ నాయకులు అవనాపు విజయ్, పిల్లా విజయ్ కుమార్, గాడు అప్పారావు, కోండ్రు శ్రీనివాసరావు పైడిరాజు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఫోక్సో కేసులో ముద్దాయి అరెస్ట్

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

మండలంలోని పుట్టూరులో మైనర్ బాలికను మోసగించిన ఘటనలో రూరల్ పోలీసులు ముద్దాయిని అరెస్టు చేశారు. ఈ కేసును సోమవారం ఎఎస్ పి.సునీల్ శరన్ విచారణ జరిపారు. అనంతరం ముద్దాయి పెంటకోట ప్రసన్న కుమార్ ను అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్సై దినకర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - కురుపాం

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ముగ్గురు యువకులు గాయపడిన ఘటన సోమవారం మధ్యాహ్నం మండలంలోని చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం పి.టి.మండకు చెందిన యువకులు గుంపస్వామి, దిలీప్, వేణు ముగ్గురు కలిసి ఒక ద్విచక్ర వాహనంతో పెళ్లివలసలో ఓ ఫంక్షన్‌కు వెళ్తుండగా ప్రమాదవశాత్తు పెళ్లివలస జంక్షన్ సమీపంలో అదుపుతప్పి బైక్ బోల్తాపడింది. దీంతో ముగ్గురు గాయపడ్డారు. వెంటనే స్థానికులు క్షతగాత్రులను కురుపాం సిహెచ్‌సికి తరలించి, చికిత్స అందజేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా! నా క్లయింట్ అయిన విజయనగరం జిల్లా, గరివిడి మండలం, గరివిడి గ్రామ కాపరుస్తుడైన వింజరపు చంద్రరావు గారి కుమారుడు వింజరపు సత్యనారాయణకు తే 01-01-1996ది నాడు యిజ్జిరోతు రామన్న గారి కుమారుడు రామమూర్తి ఆయన కుమారుడు అయిన యిజ్జిరోతు రమణ గార్లు సర్వే నెం. 33-21 మరియు 33-11 జిరాయితీ మెట్టు భూమిని రిజిస్టర్ క్రయచీటి సంఖ్య 2/96, చీపురుపల్లి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో చేయించి ఇచ్చియున్నారు. సదరు భూమి నాటి నుండి (నేటి వరకు) నా క్లయింట్ ఆధీనం, అనుభవంలో ఉన్నది. కావున నా క్లయింట్ తప్ప వేరేవ్వరు క్రింది తెలిపిన షెడ్యూల్ ఆస్తిపై అనుభవం, హక్కుదారులు కారు. సదరు భూమి హద్దులు. తూర్పు:- వల్లూరి అప్పలస్వామి తాటిపెండి, పడమర:- గెడ్డవాగు, ఉత్తర, దక్షిణములు యిజ్జిరోతు సత్యం సదరు భూ వివాదం సంఖ్య O.S.194/2018, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు విజయనగరం, జిల్లా వారి పరిధిలో ఉన్నది.

సదరు భూమిపై ఆక్రమణ, ఎటువంటి లావాదేవీలు జరిపించిన యెడల నా క్లయింట్‌ను బంధింపజాలవు.

మావూరి శంకరరావు
క్లయింట్ తరపు న్యాయవాది,
నెల్లిమర్ల, విజయనగరం జిల్లా

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT S.KOTA
O.S.90/2015

Between:
Manthina Devi ....Plaintiff
And:
To
Manthina Venkata Ramana and others .....Defendants

To
1. Manthina Venkataramana @Ramana S/o late Appaladasu,
2. Manthina laxmi D/o Satyarao,
3. Manthina Venkata laxmi D/o Satyarao,
4. Manthina Ganga D/o Satyarao,

All are residents of Mamidipalli Village, S.Kota Mandal, Vizianagaram District.

Whereas the above named Plaintiff has instituted a suit against you, you are hereby summons to appear in the above court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by any person able to answer all such questions on **22nd day of April, 2024 at 10-30 AM** to answer the claim and at the day fixed for your appearance for final disposal of the suit, you must be prepared and produce on that day all the witnesses upon whose evidence and all the documents upon which you intend to relied in support of your defense in the above suit.

Take summons that in default of your appearance on that day; the above suit will be heard and determined in your absence.

GALI ESWARARAO, ADVOCATE,
Arigipalem Village, Sompuram Post,
Vizianagaram District. Cell No.9440110309

సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని ముమ్మర ప్రచారం

ఏజెన్సీలో సిపిఎం శ్రేణుల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రానున్న ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గం సిపిఎం అభ్యర్థి మండంగి రమణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిపిఎం సీనియర్ నాయకులు మండంగి శ్రీనివాసరావు కోరారు. మండలంలోని దుడ్డుఖల్లు, గొయ్యి పాక, బీరుపాడు పంచాయితీల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు, బడుగు బలహీన వర్గాల పక్షాన అండగా ఉంటూ నిరంతరం వారి సమస్యలపై పోరాటం చేస్తున్న ఒకే ఒక పార్టీ సిపిఎం అని అన్నారు. ఎర్రజెండా నీడలో గిరిజన హక్కులు, చట్టాల రక్షణ కోసం ఇప్పటి వరకు ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగానికి విరుద్ధంగా పాలన సాగిస్తూ ఆదివాసీల జీవనానికి ఆటంకంగా మారిందన్నారు. కార్పొరేట్ వ్యక్తులతో చేతులు కలిపి ఏజెన్సీ ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు విచ్చలవిడిగా అనుమతిలిస్తూ గిరిజనులను అడవి నుంచి దూరం చేసే కుట్ర చేస్తుందన్నారు. నూటికి నూరు శాతం ఉద్యోగాల కోసం ఉన్న జిఒ 3ను ఎత్తి వేసిందన్నారు. 1/70 చట్టానికి తూట్లు పొడుస్తోందన్నారు. పోడు వ్యవసాయానికి పూర్తిస్థాయిలో పట్టాలు ఇవ్వలేదన్నారు. తాగునీరు, విద్య, వైద్యం వంటి సౌకర్యాలు కనీసం మెరుగుపడలేదన్నారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి రమణ మాట్లాడుతూ ఇండియా వేదిక సహకారంతో బలపరుస్తున్న తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే గిరిజనుల కష్టాలన్నీ తీరుతాయని అన్నారు. ఎన్డీఏ దానికి వంత పాడే మిత్రపక్షాలను చిత్తుగా ఓడించి నాడే గిరిజనులు, బడుగు బలహీన వర్గాలు కష్టాలు తీరుతాయన్నారు. ఎన్నికల ప్రచారంలో సిపిఎం అభ్యర్థికి గ్రామాల్లో మంచి స్పందన కనిపిస్తోంది. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోలక అవినాష్, మండల కార్యదర్శి పువ్వల తిరుపతిరావు, యువజన సంఘం నాయకులు పువ్వల మోహన్ రావు, గిరిజనులు, అభిమానులు పాల్గొన్నారు.

వంగరలో ప్రచారం చేస్తున్న సిపిఎం కార్యకర్తలు

వంగరలో ప్రచారం...

ఇండియా వేదిక అభ్యర్థి మండంగి రమణను ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీకి పంపించిన నాడే గిరిజనుల కష్టాలు తీరుతాయని సిపిఎం మండల నాయకులు మండంగి సన్యాసిరావు అన్నారు. సిపిఎం రెండో బృందం సభ్యులు వంగర, కేదారి పురం, నొండ్రు కోన పంచాయతీల్లో సోమవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని అభ్యర్థించారు. ఎన్డీఏ, దాని మిత్రులను అమూల్యమైన ఓటుతో గద్దె దించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

కొత్తవలసలో వైసిపికి షాక్

ఉపసర్పంచ్, వార్డు మెంబరుతో సహా30 కుటుంబాలు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - కొత్తవలస

తుమ్మికాపల్లి గ్రామానికి చెందిన వైస్ సర్పంచ్ అడ్డూరి సతీష్‌తో సహా వైసిపికి చెందిన 30 కుటుంబాలు తుమ్మికాపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పిల్లా అప్పలరాజు ఆధ్వర్యంలో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారి సమక్షంలో లక్కవరపుకోటలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వారందిరికి కోళ్ల లలిత కుమారి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్‌ని దృష్టిలో ఉంచుకొని ముగ్గురు నాయకులు కలిశారని మనమందరం కూడా కలిసికట్టుగా పనిచేసి వైసిపి ప్రభుత్వాన్ని దించాలని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి, జనసేన, బిజెపి పార్టీల కూటమి అధికారంలోకి రావాలని తెలిపారు. రెండు ఓట్లు కూడా సైకిల్ గుర్తుపై వేసి ఇద్దరి అభ్యర్థులని అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళి

మండలంలోని కాటకాపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారి పాల్గొని విగ్రహానికి నివాళి అర్పించారు.

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని గుండాలపేట గ్రామ పంచాయతీ నుండి జనసేనలోకి సోమవారం భారీ చేరికలు జరిగాయి. వైసిపికి చెందిన యూత్ లీడర్, ముఖ్య నాయకులు కాల అప్పల స్వామి వారి అనుచర గణంతో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి మాధవి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాల అప్పలస్వామితో పాటు సుమారు 70 కుటుంబాలు వైసిపిని వీడి జనసేనలో చేరాయి. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధి కోసం, ఈ ప్రజల సుస్థిరాదాయం కోసం తాను రాజకీయాల్లోకి వచ్చానని యువతకి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కలిదిండి పాణి రాజు, కంది సూర్యనారాయణ, చిరంజీవి రాజు, పడాల చిన్నారావు, గాదిపిల్లి చిన్న రామ్మూర్తి, జనసేన ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ తుమ్మి లక్ష్మి, పాలు శ్రీను, రవి రాజు, సూరిబాబు, బలగత రమేష్, నామాల శ్రీను, రామన ఆదప్పుడు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి- బొబ్బిలి

రాష్ట్రాభివృద్ధికి కూటమి విజయం అవసరమని టిడిపి నాయకులు అన్నారు. కూటమికి మద్దతివ్వాలని ఉమ్మడి అభ్యర్థి బేబీ నాయనని, ఎమ్‌పి అభ్యర్థి కలిశెట్టి అప్పల నాయుడును గెలిపించాలని సోమవారం టిడిపి నాయకులు మండలంలోని ఎరుకల పాకాల గ్రామంలో రాష్ట్ర ఎస్‌టి జనరల్ సెక్రటరీ, ఎంపిటిసి పాలవలస గౌరు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. చంద్రబాబును సిఎంగా చేయడం ద్వారా మహిళలు మరింత ఆర్థిక స్వావలంబన సాధిస్తారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు సామాన్యులకు అండగా ఉంటాయన్నారు. ప్రతీ సారి ఎన్నికల ముందు జగన్ మోహన్ రెడ్డికి డ్రామాలు చేయడం అలవాటుగా మారిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవిబాబు, పార్లమెంట్ బిసి సాధికార కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

భామినిలో ప్రచారం నిర్వహిస్తున్న జనసేన అభ్యర్థి జయకృష్ణ

తెర్లాం: మండల కేంద్రంలో టిడిపి అభ్యర్థి బేబినాయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ టిడిపి అధికారంలోకి వస్తే మండల కేంద్రంలో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నిరంతరం మీకు అందుబాటులో ఉంటానని, తనను ఆశీర్వదించాలని ప్రజలను అభ్యర్థించారు. సైకిల్ గుర్తు మీద ఓటు వేసి నన్ను ఎమ్మెల్యేకి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు వెంకట నాయుడు, మాజీ ఎంపిపి వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ రూప, ఎంపిటిసి భ్యులు ఆనందరావు, పలువురు టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

భామిని : మండల ప్రజలు ఓటు వేసి అసెంబ్లీ పంపిస్తే, పూర్తి స్థాయిలో నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని పాలకొండ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ తెలిపారు. మండలంలోని బత్తిలిలో టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తల ఆధ్వర్యంలో ముమ్మరంగా ఎన్నికలు ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర అభివృద్ధికి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు, పార్టీ గుర్తు అయిన గ్లాస్‌పై ప్రజలు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మండలం టిడిపి అధ్యక్షులు రవినాయుడు, మండలం జనసేన అధ్యక్షులు రుంకు కిరణ్, టిడిపి నాయకులు తేజోవతి, నియోజకవర్గం జనసేన కో ఆర్డినేటర్ జానీ, నిమ్మల నిబ్రం, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కురుపాం : మండలంలోని పొడి, పొడిగూడ, ఒప్పంగి, సంతోషపురం, భూర్జమానుగూడ తదితర గిరిజన గ్రామాల్లో ప్రచారం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిని తోయక జగదీశ్వరినిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి బాబు సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి కన్వీనర్ కొండయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, ఉమ్మడి పార్టీ నాయకులు ధూళీకేశ్వరరావు, రమేష్, రంగారావు, మాసయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : గిరిజనులకు అన్యాయం చేసిన వైసిపి ప్రభుత్వాన్ని ఓడించడానికి గిరిజనులు సిద్ధంగా ఉన్నారని కూటమి అభ్యర్థి నిమ్మక జయకృష్ణ అన్నారు. సోమవారం టిడిపి నాయకులు సుంకర అనిల్ దత్త్ నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాలుగున్నర ఏళ్లలో నియోజకవర్గంలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ పట్టించుకోలేదన్నారు. కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంపై దృష్టి పెడతామని అన్నారు. బిజెపి ఎంపి అభ్యర్థి కొత్తపల్లి గీత మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే సీతంపేటలో ఉన్న 8గ్రామాలని షెడ్యూల్డ్ ఏరియాలోకి చేరుస్తామని అన్నారు. వీరితో పాటు జనసేన జిల్లా అధ్యక్షులు చంద్రమోహన్, తదితరులు ఉన్నారు.

విజయం మాదే : వైసిపి

ప్రజాశక్తి- బొబ్బిలి

ఎన్ని కూటములు ఏకమైనా ప్రజలంతా తమ వైపే ఉన్నారని విజయం తమదేనని ఎమ్మెల్యే శంబంగి అన్నారు. బొబ్బిలి పురపాలక సంఘం 21వ వార్డు ఇందిరమ్మ కాలనీలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్ని పార్టీలు జతకట్టి వచ్చిన మరోసారి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కావడం ఖాయమన్నారు. ప్రజలను మోసం చేసేందుకే చంద్రబాబు కూటములు కట్టారన్నారు. గత టిడిపి ప్రభుత్వానికి ఈ ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వానికి మధ్య తేడా గమనించాలని సూచించారు. అనంతరం ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జెసిఎస్ కన్వీనర్ శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైస్ చైర్మన్లు గొలగాన రమాదేవి, చెలికాని మురళీకృష్ణ, జిల్లా జెసిఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్, పట్టణ పార్టీ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, జిల్లా ఐటి వింగ్ అధ్యక్షుడు తూముల రాంసుధీర్, పట్టణ జెసిఎస్ కన్వీనర్ రేజేటి ఈశ్వరరావు, వార్డు ఇంచార్జ్ చంద్రంపూడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: వైసిపితోనే సంక్షేమ పాలన సాధ్యమని ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు అన్నారు. ఎమ్మెల్యే తనయుడు మనదీప్ నాయుడు ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని డి కొల్లం, కె.కొల్లం, ఆర్ ముంగినాపల్లి, రెడ్డిక పేట గ్రామాల్లో వైసిపికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సిఎం జగన్ సంక్షేమ పాలన గురించి వివరించారు. రాను ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా బడ్డుకొండ అప్పలనాయుడను, ఎంపిగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డెంకాడ పిఎసిఎస్ చైర్మన్ రొ0గలి కనకసింహాచలం, వైస్ఎంపిపి తమ్మినాయుడు, నాయకులు పతివాడ కృష్ణవేణి, డి.కొల్లం సర్పంచ్ అట్టాడ శివకృష్ణ, చొల్లంగిపేట సర్పంచ్ కోరాడ కనకరాజు, పినతాడివాడ రాఘుమండ సర్పంచులు లంక లక్ష్మణరావు, గూడేల విష్ణు పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రచారంలో భాగంగా ఎంపిని సత్కరిస్తున్న చీపురుపల్లి వాసులు

పాలకొండలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపి,ఎమ్మెల్యే అభ్యర్థులు

చీపురుపల్లి: ఆశీర్వదించండి చీపురుపల్లిని మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ ప్రజలను కోరారు. సోమవారం పట్టణంలో గల పలు వైశ్య కుటుంబాలను కలిసి తనకు మద్దతు తెలపాలని కోరారు. 2019లో ఏ విధంగా అయితే తనకు ఓటు వేసి పార్లమెంటుకి పంపించారో ఈ దపా కూడా తనతో పాటు శాసన సభకు పోటీ చేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణకు ఓటు వేసి గెలిపించాలని వారిని బెల్లాన కోరారు. తనను, బొత్సను గెలిపిస్తే చీపురుపల్లిని మరింత అభివృద్ధి చేస్తామని ఆయన కళింగ వైశ్యులను కోరారు.

గజపతినగరం: మండలంలోని పట్రువాడ, గంగచోళ్ళపెంటలో వైసిపి మండల అధ్యక్షులు బూడి వెంకటరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జెడ్‌పిటిసి గార తవుడు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, ప్రజా ప్రభుత్వమని, సంక్షేమ ప్రభుత్వమని అన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్న, అభివృద్ధి జరగాలన్న ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో నాయకులు త్రినాధరావు, మండల సురేష్, కరణం ఆదినారాయణ, సామంతుల పైడిరాజు, గ్రామ సర్పంచ్ బోని సంగమయ్య, ఎంపిటిసి కనకాల పైడన్న, గార రమణ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో వైసిపి ప్రచారం

పాలకొండ : పట్టణంలో వైసిపి ఎంపి అభ్యర్థి తనూజ రాణి, ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి పలు వీధుల్లో ఇంటి ఇంటికి వెళ్లి ప్రచారం చేపట్టారు. ఓటర్లను కలిసి జగన్ మోహన్ రెడ్డి చేసిన అభివద్ధిని చూసి తమకే ఓటు వేయాలని కోరారు.

1983 నుంచి 2004 వరకు ఆ ఇద్దరి నాయకులదే ఆధిపత్యం

నియోజకవర్గాల పునర్విభజనలో ఉణుకూరు కనుమరుగు



నాడు ఉణుకూరు.. నేడు రాజాం

ప్రజాశక్తి- రేగిడి

సమితుల నాటి కాలంలో 1962లో గ్రామీణ ప్రాంతమైన రేగిడి మండలంలో కుగ్రామమైన ఉణుకూరు నియోజకవర్గంగా ఏర్పడింది. ఈ నియోజకవర్గంలో బిసి సామాజిక వర్గీయులు పోటీలో నిలిచారు. 2011 జనాభా లెక్కల ప్రాప్తికి 2009లో నియోజకవర్గం పునర్విభజన ఉణుకూరు నియోజకవర్గం బిసి రిజర్వేషన్ నుంచి ఎస్‌సి రాజాం నియోజకవర్గంగా మారింది. 1967లో కాంగ్రెస్ తరపున పాలవలస సంఘంనాయుడు, ఇండిపెండెంట్‌లుగా ముదిలి పరంకుశం నాయుడు పోటీ పడ్డారు. ఈ పోటీలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పరంకుశం నాయుడు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1972లో కాంగ్రెస్ అభ్యర్థిగా పాలవలస రుక్మిణమ్మ పోటీలు ఉండగా ఇండిపెండెంట్‌లుగా ముదిలి పరంకుశం నాయుడు, కిమిడి రాజగోపాల్‌రావు బరిలో దిగారు. కాంగ్రెస్ తరపున పాలవలస రుక్మిణమ్మ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1978లో జనతా తరపున పరంకుశంనాయుడు పోటీలో ఉండగా కాంగ్రెస్ తరపున పాలవలస రుక్మిణమ్మ పోటీలోకి దిగారు. జనతా ఎమ్మెల్యేగా పరంకుశంనాయుడు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1983లో కిమిడి కళా వెంకట్రావు టిడిపి తరపున పోటీ చేయగా, పాలవలస రుక్మిణమ్మ కుమారుడు పాలవలస రాజశేఖర్ కాంగ్రెస్ తరపున పోటీలు చేశారు. కళా వెంకట్రావు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1985లో టిడిపి తరపున కిమిడి కళా వెంకట్రావు పోటీలో ఉండగా దేవుదలకు చెందిన కెంబూరు ఆనందరావు కాంగ్రెస్ తరపున పోటీలో దిగారు. టిడిపి ఎమ్మెల్యేగా కళా వెంకట్రావు గెలుపొందారు. 1989లో మరోసారి కాంగ్రెస్ తరపున పాలవలస రాజశేఖర్, టిడిపి తరపున కిమిడి కళా వెంకట్రావు పోటీ పడగా అప్పుడు కూడా టిడిపి తరపున కిమిడి కళా వెంకట రావు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1994లో టిడిపి తరపున కళా వెంకట్రావు పోటీలో ఉండగా, పాలవలస రాజశేఖర్ కాంగ్రెస్ తరపున పోటీ చేశారు. ఈ పోటీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పాలవలస రాజశేఖరం గెలుపొందారు. 1999లో టిడిపి తరపున కిమిడి కళా వెంకట్రావు పోటీలో ఉండగా, పాలవలస రాజశేఖర్ కాంగ్రెస్ తరపున పోటీ చేశారు. ఈ పోటీల్లో టిడిపి తరఫున కళా వెంకట్రావు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2004లో కాంగ్రెస్ తరపున పాలవలస రాజశేఖర్ పోటీలో ఉండగా, టిడిపి తరపున కిమిడి కళా వెంకట్రావు పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో ఉణుకూరు నియోజకవర్గాన్ని కనుమరుగు చేసి, రాజాం ఎస్‌సి రిజర్వేషన్ నియోజకవర్గంగా ఏర్పడింది. రాజాం నియోజకవర్గం ఏర్పడిన అనంతరం 2009లో కాంగ్రెస్ తరపున కోండ్రు మురళీ మోహన్, ప్రజారాజ్యం తరపున కంబాల జోగులు, టిడిపి తరపున కావలి ప్రతిభా భారతి పోటీ పడ్డారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ గెలుపొందారు. 2014లో వైసిపి తరపున కంబాల జోగులు, టిడిపి తరపున కోండ్రు మురళీమోహన్ పోటీ పడగా కంబాల జోగులు విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో టిడిపి తరపున కోండ్రు మురళి మోహన్, వైసిపి నుంచి కంబాల జోగులు, జనసేన నుంచి ముచ్చ శ్రీనివాసరావు పోటీ పడగా కంబాల జోగులు రెండోసారి విజయం సాధించారు. 2024లో టిడిపి తరఫున మూడోసారి కోండ్రు మురళీ బరిలో ఉండగా, వైసిపి తరపున డాక్టర్ తలే రాజేష్, కాంగ్రెస్ తరపున కంబాల రాజవర్ధన్ పోటీలో ఉన్నారు. టిడిపి, వైసిపిల మధ్య పోటి రసవత్తరంగా ఉంది. ఈ ఎన్నికల్లో ఓటర్లు ఎవరు వైపు ఉన్నారో వేచి చూడవలసిందే.

రాజాం నియోజకవర్గం ఓటర్లు

రాజాం నియోజకవర్గంలో రాజాం, రేగిడి, సంతకవిటి, వంగర మండలాలున్నాయి. ఈ మండలాల్లో అత్యధికంగా బిసి కులానికి చెందిన వారే అధికంగా ఉన్నారు. నియోజకవర్గంలో 2,24,227 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 1,12,955 మంది, మహిళలు 1,11253 మంది ఉన్నారు. మండలాల వారీగా ఓటర్లను చూసుకుంటే రాజాం మండలానికి మహిళలు 38160, పురుషులు 38,530 మంది ఓటర్లు ఉన్నారు. వంగర మండలంలో మహిళలు 17,420 మంది ఓటర్లు కాగా, 17,613 మంది పురుషుల ఓటర్లు ఉన్నారు. రేగిడి మండలంలో 27,629 మహిళా ఓటర్లు ఉండగా, 28,506 పురుషులు ఓటర్లగా ఉన్నారు. సంతకవిటి మండలంలో 28,044 మహిళా ఓటర్లు ఉండగా, 28,306 మంది పురుషుల ఓటర్లు ఉన్నారు.

హైటెక్ ప్రచారం

సోషల్ మీడియానే ప్రధాన అస్త్రం

ప్రజాశక్తి-చీపురుపల్లి

ఎన్నికల ప్రచార శైలి రోజు రోజుకూ మారుతోంది. ఆధునిక పోకడలకు తోడు నాయకులు తమ పంథాను మార్చుకుంటున్నారు. మూస ప్రచారానికి స్వస్తి చెప్పి అధునాతన సాంకేతికతను అభ్యర్థులు వినియోగించుకుంటున్నారు. ఓటరకు దగ్గరయ్యే ప్రయాత్నాన్ని అభ్యర్థులు చేస్తున్నారు. ఒకప్పుడు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు గోడలపై చేతి రాతలు, బ్యానర్లు వంటి వాటితో ప్రచారం నిర్వహించిన నాయకులు రానురాను మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రచార శైలి మారింది. ఆటోలు, జీపులకు మైక్‌లు కట్టి ప్రచారం చేసేవారు. అది కూడా నేడు మారిపోయి వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్రసార సాధనాలను వినియోగిస్తూ అభ్యర్థులు తమ ప్రచారం ఉద్దేశాన్ని క్షణాల్లో ఓటరకు చేరవేస్తున్నారు. ఒక ప్రాంతం నుంచి మాట్లాడుతూ మరొక ప్రాంతంలో ఉన్న ప్రజలకు తమ ఉద్దేశాన్ని తెలియజేయడానికి ఎల్‌ఇడి స్రీన్‌లను వాడుతూ అభ్యర్థులు ఓటర్లను ఆకర్షిస్తున్నారు. దీని ద్వారా వారి సమయం కూడా ఆదా అవుతుందనే ఆలోచనకు నాయకులు వచ్చారు.

అభ్యర్థులు ఓటర్లకు మరింత దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు. ఒకప్పుడు బుర్రకథలను ఏర్పాటు చేసి గత పాలకులు చేసిన తప్పులను, వైఫల్యాలను, తాము అధికారంలోకి వస్తే చేసే పనులు తాలూకా వివరాలను ప్రజలకు పాటల ద్వారా వినిపించేవారు. కాని ఇప్పుడు ఆ సంస్కృతి కనుమరుగైంది. ఓటర్లను ఆకర్షించేందుకు అభ్యర్థులు ఎన్నికల హామీలను వస్త్రంతో తయారు చేసిన బ్యానర్లు, గోడలపై రాతలతో రాసి ప్రచారం నిర్వహించేవారు. గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించనున్న హామీలను బ్యానర్లపై ముద్రించేవారు. ఎండ్ల బండ్లపై బహిరంగ సభలకు ప్రజలను తరలించే వారు. అంతే గాకుండా రిక్షాలకు, ఆటోలకు మైకులు ఏర్పాటుచేసి ఊరూరా తిరుగుతూ అభ్యర్థుల గెలునకు సహకరించాలని ఓటర్లను కోరే వారు. కానీ అవేమీ నేడు లేక పోవడంతో బ్యానర్లు తయారు చేసేవారు, గోడపై రాతలు రాసేవారు, రిక్షాలలో ప్రచారం చేసేవారు, మైకులలో అభ్యర్థుల గురుంచి ప్రచారం చేసేవారంతా ఉపాధి కోల్పోయారు.

వినూత్న పద్ధతులతో ప్రచారానికి శ్రీకారం

పాత పద్ధతులను పక్కన పెట్టిన అభ్యర్థులు ప్రచారంలో వినూత్న పద్ధతులకు శ్రీకారం చుడుతున్నారు. హద్దు మీరి సోషల్ మీడియాను అభ్యర్థులు వాడుతున్నారు. ప్రస్తుతం ప్రతీ ఇంటిలో ప్రతీ ఒక్కరు స్మార్ట్‌ఫోన్ వినియోగిస్తుండడంతో సోసల్ మీడియాను ప్రధానాస్త్రంగా చేసుకొని ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా యువతను ఆకర్షించేందుకు సోషల్ మీడియాలో అభ్యర్థులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

ఇప్పటికే అభ్యర్థులు వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, ట్విట్టర్ వంటి ప్రచార మాధ్యమాల ద్వారా కొంత మందిని నియమించుకొని తమకు అనుకూల రీతిలో ఓటర్లను ఆకర్షించే విధంగా ప్రచారాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. నేడు అ పరిస్థితిలేదు. బారీ మోటారు వాహనాల ద్వారా పెద్ద ఎత్తున జరిగే సభలకు ప్రజలను తరలిస్తున్నారు. మరోవైపు ఎల్‌ఇడి స్క్రీన్‌లు ఏర్పాటు చేసి సభ ఉద్దేశాన్ని బలంగా చాటే విధంగా అభ్యర్థులు ప్రయత్నం చేస్తున్నారు. దీనికి తోడు హైడ్రోజన్ బెలూన్లను గాల్లోకి వదులుతూ ప్రత్యర్దులకు తాము అందనంత ఎత్తులో ఉన్నామనే సంకేతాన్ని ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ ప్రచారం రాబోయే రోజుల్లో ఏ స్థాయి చేరుతుందో వేచి చూడాల్సిందే.

నెల్లిమర్లలో వైసిపి కోటకు బీటలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల



గత ఎన్నికల నుంచి వైసిపికి కంచుకోటగా నిలిచిన నెల్లిమర్ల పార్టీ బీటలు వారుతోంది. ముఖ్యంగా మండలంతో బాటు, నగర పంచాయతీలో అధికార వైసిపికి చెందిన ఒక్కొక్కరుగా ఇతర పార్టీలోకి చేరుతున్నారు. వైసిపికి పట్టు కొమ్మలుగా ఉన్న టెక్కలి, కొండ వెలగాడ, పూతిక పేట, ఒమ్మి గ్రామాల నుంచి వైసిపిని వీడి నాయకులు టిడిపి, జనసేనలో చేరుతున్నారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజినీ, 16వ వార్డు కౌన్సిలర్ పంద్రాంకి సత్యవతి, నాయకులు సత్యనారాయణ తన అనుచరగణంతో కలిసి జనసేన తీర్ధం పుచ్చుకున్నారు. కాగా మండల స్థాయి, జిల్లా స్థాయి అధికార వైసిపి నాయకులు కూడా పార్టీని వీడుతారని సమాచారం రావడంతో అధిష్టానం ఆగమేఘాల మీద వారిని బుజ్జగించి దిద్దుబాటు చర్యలు చేపడుతుంది. స్వయంకృతంగా అధికార వైసిపి తీసుకున్న నిర్ణయాలతో కొంత మంది విసిగి వేసారి వేరే పార్టీలో చేరుతున్నట్లు చర్చ జరుగుతోంది. నగర పంచాయతీ పరిధి నెల్లిమర్ల, జరజాపు పేటలో అధికార వైసిపిపై ఆ పార్టీ నేతలే అసంతృప్తితో ర గిలి పో త ు న్న ట్ల తెలుస్తోంది. కాగా ఇటీవల మిమ్స్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో అధికార వైసిపి వ్యవహరించిన తీరు కూడా ఆపార్టీ పట్ల వ్యతిరేకత కనిపిస్తుంది. మండలంలోని పూతికపేట మాజీ సర్పంచ్ గోవింద, జెడ్‌పిటిసి స్వగ్రామం కొండవెలగాడకు చెందిన వైసిపి నాయకులు పెద్ద ఎత్తున జనసేనలో చేరారు. టెక్కలి మాజీ సర్పంచ్ వైసిపిని వీడి టిడిపిలో చేరారు. ఇలా పలు గ్రామాలకు చెందిన వైసిపి మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు టిడిపి, జనసేనలో చేరడంతో వైసిపి పట్టు సడలుతోంది. వైసిపి మండల స్థాయి నాయకత్వంలో కూడా అసంతృప్తి కనిపిస్తోంది. దీంతో వారిలో చాలా మంది పార్టీ మారిపోతారనే వాదన వినిపిస్తోంది.

మళ్లీ మాదే అధికారం : ఎమ్మెల్సీ

పాలకొండ : రాష్ట్రంలో మరోసారి వైసిపి అధికారంలోకి వస్తుందని ప్రభుత్వ విప్ పాలవలన విక్రాంత్ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజలందరికీ మేలు జగన్ మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి మళ్లీ అధికారంలోకి వస్తారని కొంతమంది వ్యక్తులు ఆయనపై దాడి చేస్తున్నారని ఆయన అన్నారు. అరకు ఎంపీ సీటుతో పాటు పాలకొండ ఎమ్మెల్యే సీటు కూడా భారీ మెజారిటీతో గెలుస్తామన్నారు. కూటమి ఎంపి అభ్యర్థి 2014 నుండి 2019వరకు ఎంపీగా పని చేసి ఎన్ని ఆరోపణలు ఎదుర్కొన్నారో అందరికీ తెలిసిన విషయమేనన్నారు. ఎస్టీ కాదన్న విషయం అందరికీ తెలుసన్నారు. ఇప్పటికే రెండుసార్లు ఓటమి పాలై జనసేన అభ్యర్థిగా బరిలో ఉన్న నిమ్మక జయకృష్ణకు ఈసారి కూడా అదే గతి పడుతుందన్నారు. అసభ్య పదజాలాలతో తప్పుడు విమర్శలు చేయడం జయకృష్ణకు సరికాదని అన్నారు. 2014లో ఎమ్మెల్యేను పక్కన పెట్టి ఇన్-ఛార్జ్‌గా ఉన్న జయకృష్ణ ఏం పని చేశారని ప్రశ్నించారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వసరాయి కళావతి, ఎంపీ అభ్యర్థి తనూజ రాణి అన్నారు.

రారెత్తిస్తున్న ఎండలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

వారంరోజులుగా తన ప్రతాపం చూపిస్తున్న భానుడు సోమవారం జిల్లాలోని అన్ని మండలాల్లోనూ నిప్పులు కురిపించాడు. అందుకు నిదర్శనం సోమవారం నమోదైన ఉష్ణోగ్రతలను చూస్తే అర్థమౌతుంది. వివరాలిలా ఉన్నాయి. అత్యధికంగా సాలూరు 43.1 డిగ్రీలు నమోదు కాగా, కురుపాం 41,6, గుమ్మలక్ష్మీపురం 41.6, సీతానగరం 40.2, పార్వతీపురం 40, భామిని 4 1.6, పాలకొండ 41.6, జియ్యమ్మవలస 41.6, పాచిపెంట 40.2, మక్కువ 40.9, సీతంపేట 40, బలిజిపేట 40.9,

ఎండకు తలపై తువ్వాలు వేసుక్కు వ్యక్తి

కొమరాడ 38.7, వీరఘట్టం 41.6, గరుగుబిల్లి39.9 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 7గంటల నుండి వాతావరణం వేడెక్కడంతో ఉపాధి హామీ కూలీలు పనులు సక్రమంగా నిర్వహించలేకపోతున్నారు. రానున్న రోజుల్లో కూడా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ, విపత్తుల నివారణ శాఖకు చెందిన అధికారులు హెచ్చరిస్తున్నందు వల్ల ప్రజలు గమనించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అధిక ఉష్ణోగ్రతల వల్ల డీహైడ్రేషన్ పెరిగే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ ఉదయం 10గంటల తర్వాత బయటకు రాకూడదని, వచ్చినా నూలు దుస్తులు ధరించడం, శీతలపానీయాలు సేవించడంతో పాటు తప్పనిసరిగి తలకు టోపీలు ధరించాలని జిల్లా కేంద్రాసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ వాగ్దేవి సూచిస్తున్నారు.

తుప్పపడుతున్న తలుపులు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఇనుము తలుపులకు తుప్పు పడుతున్నాయి. మేజర్ పంచాయతీకి ఆదాయం చేకూర్చేందుకు వీలుగా మేజర్ పంచాయతీకి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో 8 షాపులు నిర్మించి వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి తోడ్పడుతుందని గతేడాది నిర్మాణ పనులు చేపట్టి వినియోగంలోకి తీసుకొచ్చారు. షాపుల నిర్మాణంతో పాటు వాటికి తలుపులు అమర్చేందుకు అప్పట్లో ఇనప తలుపులు ఏర్పాటు చేశారు. అనుకొను దొక్కటి ..జరిగిన దొక్కటే అన్నట్టుగా తీసుకున్న నిర్ణయాలు ఆలోచన లేకుండా చేయడం వల్ల ప్రజాధనం వృథా అయ్యిందని పంచాయతీ అధికారులపై స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు.

వైసిపితో బిసిలకు తీవ్ర అన్యాయం

ప్రజాశక్తి - రామభద్రపురం

వైసిపి హాయాంలో బిసిలకు తీవ్ర అన్యాయం జరిగిందని టిడిపి బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కర్రోతు తిరుపతిరావు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని నర్సాపురం గ్రామంలో సోమవారం జయహో బిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డికి బిసిలంటే చులకన భావమని అందువల్లనే పదవుల్లో బిసిలకంటే రెడ్లకే ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఏటా బిసి కార్పోరేషన్ ద్వారా వేలాది మంది యువతకు సబ్సిడీపై రుణాలు టిడిపి అందించేదని, వైసిపి ప్రభుత్వం ఆ రుణాలను తుంగలో తొక్కిందన్నారు. టిడిపి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు వైసిపి గుండెల్లో రైళు పరిగెట్టిస్తోందన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షుడు కరణం విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి - వీరఘట్టం

ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు సంబంధించి పోస్టల్‌లో ఓటును వినియోగించుకునేందుకు వీలుగా సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బంది దరఖాస్తులు స్వీకరించారు. పిఒ, ఎపిఒలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించామని సిబ్బంది తెలిపారు.

సర్వే సమర్ధవంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

స్టేట్ లెర్నింగ్ అచీవ్మెంట్ సర్వే- 2024, సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి పగడాలమ్మ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో గల ప్రభుత్వం బాలికల పాఠశాలలో జరుగుతున్న ఫీల్డ్ ఇన్విజిలేటర్ల శిక్షణ నిర్వహణను సందర్శించారు. ఈ సందర్భంగా డిఇఒ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక హనుమాన్ జంక్షన్ కోడ్‌లో సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎస్సై ఎం రాజేష్ స్పెషల్ స్క్వాడ్ ఆధ్వర్యంలో ముందరగా వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరు ఎటువంటి అక్రమంగా మద్యం గానీ, డబ్బులు గానీ చేయరాదని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్పెషల్స్ స్క్వాడ్ పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి అన్నారు. పట్టణంలోని రాతిపనివారివీధి, కోరాడవీధి, టిటిడి కళ్యాణ మండపం రోడ్డులో పారిశుధ్య పనులను ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య తడి,పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని ఆదేశించారు. మురుగునీటి కాలువలలో పూడికలు ఎప్పటికప్పుడు తీయాలన్నారు. పారిశుధ్య కార్మికుల పని విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆమెతో పారిశుధ్య విభాగ సిబ్బంది ఉన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన రాష్ట్ర పరిశీలకులు

ప్రజాశక్తి - భోగాపురం

ప్రపంచ బ్యాంకు నిధులతో పాఠశాలలో అమలవుతున్న విధివిధానాలను రాష్ట్ర పరిశీలకులు ఎన్.శ్రీనివాసు మండలంలోని గొల్లపేట పాఠశాలను సోమవారం పరిశీలించారు. ఉదయం ప్రార్ధన నుండి విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకం పరిశీలించారు. విద్యార్థుల హజరు, తల్లిదండ్రుల కమిటీ సమావేశం జరుగుతున్న తీరుతెన్నులు, ప్రథమ చికిత్స పెట్టె నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. టాయిలెట్స్ నిర్వహణ, టిఎంఎఫ్ నిధుల వినియోగం, సచివాలయ సిబ్బంది పర్యవేక్షణ వంటి అంశాలను పరిశీలించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. కాశీరాజుని మెచ్చుకున్నారు. ఎంఇఒ 2 బి. చంద్రమౌళి, సిఆర్‌పి శేషబాబు ఆయన వెంట ఉన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న శ్రీనివాస్

గ్రామాల్లో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి- జామి, విజయనగరం

జామి మండలంలోని భీమసింగి, విజయనగరం మండలంలోని అయ్యన్నపేట గ్రామాల్లో విజినిగిరి గ్రామానికి చెందిన యోగా కేంద్రం నిర్వాహకులు సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ సాధకులు పి. శివ, వై.గోవిందరావు, నాగార్జున, కె. అప్పారావు మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో గ్రామాల్లో మజ్జిగ పంపిణీ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. యోగా కేంద్రం పలు సేవా కార్యక్రమాలను కూడా చేపడుతున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా కేంద్రం ప్రతినిధులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

నిరంతరం పటిష్ట నిఘా ఉండాలి

ప్రజాశక్తి - కొమరాడ

సాధారణ ఎన్నికల దృష్ట్యా ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద నిరంతరం పటిష్ట నిఘా ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ అన్నారు. మండలంలో సోమవారం కూనేరు చెక్ పోస్ట్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. చెక్ పోస్టుల వద్ద కేసుల నమోదు, నగదు, వాహనాలు సీజ్ చేసిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్రమ మద్యం, నగదు తరలించకుండా 24 గంటలు నిరంతర పటిష్ట నిఘాను పెట్టాలని సూచించారు. చెక్‌పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ద్వారా చెక్ పోస్ట్ తనిఖీలను కంట్రోల్ రూమ్ నుండి ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందన్నారు. చెక్ పోస్టుల నుండి సిసి కెమెరాలు పని తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ విధమైన ఉదాసీనతను ప్రదర్శించిన సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని అన్నారు. ప్రజలు తమతో పాటు తీసుకువెళ్లే నగదు, బంగారం, ఆభరణాలు వంటి వాటికి విధిగా ఆధారాలు కలిగి ఉండాలని ఆయన స్పష్టం చేశారు. మద్యం, మాదక ద్రవ్యాలు రవాణాపై గట్టి నిఘా ఉండాలని ఆయన ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంపిడిఒ మల్లికార్జునరావు, తహశీల్దార్ రమేష్, ఎస్సై నీలకంఠం, ఆర్ఐ శ్రీనివాసరావు, చెక్ పోస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

కూనేరు చెక్‌పోస్టును తనిఖీ చేసిన కలెక్టర్

జగన్‌పై దాడి నీచమైన చర్య

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పై దాడి నీచమైన చర్య అని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని వైసిపి కార్యాలయం వద్ద ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన సర్వేలలో మళ్లీ జగనే రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవుతాడని తేల్చి చెప్పడం, జగన్మోహన్ రెడ్డికి ప్రజలలో వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలో భాగమే ఈ దాడి అని ఆయన అన్నారు. జగన్మోహన్ రెడ్డికి గట్టి భద్రత కల్పించాలని కోరారు.

ఈనెల 19న నామినేషన్

శృంగవరపుకోట తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఈ నెల 19న తాను నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు తైనాల విజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతి, కొప్పల వేలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, జిసిసి చైర్మన్ శోభ స్వాతిరాణి, జెడ్‌పిటిసి ముంగులూరు వెంకటలక్ష్మి, వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

మైనార్టీల సంక్షేమం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పట్టణంలోని ఎరుకమ్మ పేరంటాలు కళ్యాణ మండపంలో నిర్వహించిన నూర్ భాషా దూదేకుల ముస్లిం ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించారని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మైనార్టీలకు ఏడు ఎమ్మెల్యే సీట్లు ఇచ్చారని నవరత్నాల్లో భాగంగా మైనార్టీ మహిళల పేరిట ఇళ్ల స్థలాలను అందజేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు షేక్ రహిమాన్, నియోజకవర్గంలోని ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

సిఎంపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

పాచిపెంట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై దాడిని నిరసిస్తూ మండల వైసిపి నాయకులు సోమవారం పాచిపెంటలో నల్ల బ్యాడ్జీలతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి బి.ప్రమీల మాట్లాడుతూ సిఎంపై దాడి అమానుషమని, దాడికి పాల్పడిన వారిపై ఎన్నికల కమిషన్ కఠినంగా శిక్షించాలని చంద్రబాబు నీచ రాజకీయాలకు ఇది నిదర్శనమని ఆమె అన్నారు. వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి డోల బాబ్జీ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా సిఎంకు ప్రజల నుంచి అనూహ్యస్పందన చూసి ఓర్వలేక ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మండల పార్టీ అధ్యక్షులు గొట్టాపు ముత్యాల నాయుడు మాట్లాడుతూ సిఎంపై హత్య ప్రయత్నం దారుణమని, జనాదరణ చూసి ఓర్వలేక ఎన్‌డిఎ కూటమి నాయకులు ఈ దాడికి పాల్పడ్డారని, ఎన్నికల కమిషన్ క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ వైస్ ఎంపిపి టి.గౌరీశ్వరరావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో వైసీపీకి వస్తున్న ప్రజా ఆదరణ చూసి ఓర్వలేక సిఎం జగన్ మోహన్‌రెడ్డి పై రాళ్లతో దాడి చేశారని, దాడికి ప్రేరేపించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి కె.రవీంద్ర, మీసాల చంటి, మజ్జి వెంకట్రావు, నడిపల్లి ధనరాజ్, రామకృష్ణ, సేనాపతి బాబురావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి ప్రమీల

సాలూరు : సిఎం జగన్ మోహన్ రెడ్డిపై రాయి దాడి వెనుక ప్రతిపక్ష పార్టీల కుట్ర ఉందనే అనుమానాలు ఉన్నాయనిమండల వైసిపి అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు పువ్వాడ రామకృష్ణ, దండి శ్రీనివాసరావు, పెద్దింటి మాధవరావు అన్నారు. సోమవారం వారు మామిడిపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మేమంతా సిద్దం బస్సు యాత్రకు లభిస్తున్న ప్రజాదరణను చూసి తట్టుకోలేని టిడిపి, జనసేన నాయకులే ఇలాంటి దాడికి ప్రోత్సహించి ఉంటారన్నారు. ఈ దాడిని ఖండిస్తూ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైసిపి నాయకులు కాగాన పోలి నాయుడు, సాదాపు రమణ, సాంబ పాల్గొన్నారు.

ఇఎంఆర్ఎస్ పరీక్షల్లో సింహాచలం ఫస్ట్

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల బాలికల పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు బి.సింహాచలం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన పరీక్షలో ఉత్తీర్ణత సాధించి వ్యాయామ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. ఆమె రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో, జాతీయ స్థాయిలో ఒబిసి కోటాలో 43 స్థానంలో నిలిచారు. ఒకవైపు జ్యోతి రావు పూలే గురుకుల పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తూ ఏకలవ్య పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన పరీక్షలకు ఆమె సిద్ధమయ్యారు. ఆమె భర్త రెడ్డి పోలినాయుడు గిరిజన సంక్షేమ శాఖ లో ఉపాధ్యా యుడిగా పని చేస్తున్నారు. సీతానగరం మండలంలోని చినబోగిల గ్రామానికి చెందిన సింహాచలం ఇఎంఆర్ఎస్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంపై భర్త పోలినాయుడు, కుటుంబ సభ్యులు,తోటి ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

పత్రాలు సేకరణ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని ఆయా పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వీలునామా పత్రాలను సేకరిస్తున్నట్లు కంబరవలస ప్రధానోపాధ్యాయులు ఎం.పైడిరాజు సోమవారం తెలిపారు. విద్యార్థులు ఐదో తరగతి పూర్తయిన తర్వాత ఏఏ పాఠశాలల్లో విద్యను కొనసాగిస్తారో ఆ పాఠశాలలో చదివించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు నుంచి వీలునామా పత్రాలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆయనతో పాటు సిబ్బంది, విద్యార్థులు తల్లిదండ్రులు ఉన్నారు.

పోలింగ్ పటిష్టంగా నిర్వహించాలి

పోలింగ్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్ఒ విష్ణుచరణ్

ప్రజాశక్తి - సాలూరు

పోలింగ్ పటిష్టంగా నిర్వహించాలని నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి సి. విష్ణు చరణ్ అన్నారు. సాలూరు నియోజకవర్గ ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని విష్ణు చరణ్ సోమవారం తనిఖీ చేశారు. ఎన్నికల ప్రక్రియలో పాటించాల్సిన ప్రవర్తనా నియమావళి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధులు నిర్వహణ తదితర అంశాలపై అందిస్తున్న శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో భాగస్వామ్య మైనందుకు చిత్తశుద్ధితో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తామని భావించి ఎటువంటి ఆరోపణలు లేకుండా స్వేచ్ఛగా ప్రశాంతంగా జరిగేలా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో ప్రిసైడింగ్, సెక్టార్ అధికారులు కీలకమని అన్నారు. ఎక్కడ ఎటువంటి లోపాలు తలెత్తకుండా ఎన్నికలు సక్రమంగా జరిగేందుకు ఏమైనా అనుమానాలు ఉంటే శిక్షణలో పూర్తి స్థాయిలో నివృత్తి చేసుకోవాలని అన్నారు. మాక్ పోలింగ్ మొదలుకొని స్ట్రాంగ్ రూములో ఇవిఎంలు భద్రపరిచే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై పలు సూచనలు చేశారు. నిర్లక్ష్యం చూపిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సెక్టార్ అధికారులు సైతం పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. అనంతరం మాక్ పోలింగ్ ను పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్లు, సెక్టార్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : పోలింగ్ రోజు ప్రిసైడింగ్ అధికారులదే పూర్తి బాధ్యతని పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనకుమారి అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఇస్తోన్న శిక్షణా తరగతులను ఆర్వో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ పోలింగ్ రోజు పిఒ, ఎపిఒలు చేపట్టాల్సిన విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. శిక్షణలో ప్రతి అంశాన్ని తెలుసుకోవాలని అన్నారు. మాక్ పోలింగ్ తప్పనిసరిగా నిర్వహించాలని అన్నారు. ఇఒఎంల పనితీరుపై అవగాహన ఉండాలన్నారు. పోలింగ్ రోజు నిర్దిష్ట సమయానికి పోలింగ్ ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్లు మహేశ్వరరావు మాస్టర్ ట్రైనీలు, ఇతర రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలలను ఎన్నికల పనులకు వినియోగిస్తే చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం

18 ఏళ్ల లోపు బాలలను రాజకీయ పార్టీల వారు ఏ ఇతర కార్యక్రమాల్లోనూ, సార్వత్రిక ఎన్నికల్లోనూ, ప్రచార పనులకు వినియోగించకూడదని కార్మికశాఖ సహాయ కమిషనర్ కె.రామకృష్ణారావు తెలిపారు. బాలలను రాజకీయ కార్యకలాపాలకు వినియోగించుకున్నచో బాల కార్మిక నిషేద చట్టం ప్రకారం 6 నెలల జైలు శిక్ష, రూ.50 వేల వరకు జరిమానాకు బాధ్యులని తెలిపారు. ముఖ్యంగా ఇటుక బట్టీల్లో పనిచేసే అంతర్ రాష్ట్ర వలస కార్మికులను తమ ఓటు హక్కును వినియోగించుకొనుటకై వారి రాష్ట్రంలోని స్వగ్రామాలకు తప్పనిసరిగా పంపించాలని సూచించారు. అలాగే పంపని యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకొకుంటామని హెచ్చరించారు.

పనిచేసే చోట సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని ఉపాధిహామీ పనులు చేసే చోట కూలీలకు తాగునీరు నీడ ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టాలని ఎంపిడిఒ దేవకుమార్ సూచించారు. సోమవారం ఉపాధి హామీ పనులకు సంబంధించి మేట్‌లతో మొదటి రోజు శిక్షణా కార్యక్రమం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిర్వహించారు. మండలంలోని కాశీపట్నం సచివాలయంలో 12 పంచాయతీలకు సంబంధించిన విధి విధానాలపై ఈ సందర్భంగా వివరించారు. ఎండ తీవ్రత దృష్టిలో పెట్టుకుని అలాగే ఉదయం, సాయంత్రం జరిగే పనుల్లో భాగంగా ఫోటోల అప్‌డేట్, వేతనదారుల సంఖ్య పెరిగేలా చూడాలని మేట్‌లకు శిక్షణలో వివరించారు. కార్యక్రమంలో ఎపిఒ శంబంగి ఈశ్వరమ్మ, పాచిపెంట ఎపిఒ మహేష్(ట్రైనింగ్ కోఆర్డినేటర్) ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి : డిఎంఒ

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామీణ ప్రజలకు పిహెచ్‌సిల ద్వారా మెరుగైన వైద్య సేవలందించి, వారి ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యమివ్వాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్ మోహనరావు అన్నారు. ఈ మేరకు ఆయన స్థానిక పిహెచ్‌సి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షల వివరాలు పరిశీలించారు. ఆసుపత్రికి వైద్యం కోసం వస్తున్న వారి ఆరోగ్య సమస్యలను స్పష్టంగా తెలుసుకొని, వ్యాధి నిర్ధారణ ఖచ్చితంగా జరపడం ద్వారా, సరైన చికిత్స అందించవచ్చని తెలిపారు. జ్వర నిర్ధారణ పరీక్షల రికార్డులు తనిఖీ చేశారు. ఆసుపత్రిలో క్షేత్ర స్థాయిలో జ్వర లక్షణాలున్న వారిని గుర్తిస్తే తప్పనిసరిగా రక్తపూతలు (స్లైడ్స్) సేకరించాలని ల్యాబ్ టెక్నీషియన్, క్షేత్ర స్థాయి సిబ్బందిని ఆదేశించారు. మందులు, వ్యాక్సిన్ నిల్వలు ఎప్పటికప్పుడు గమనించాలని, కాలపరిమితి దగ్గరగా ఉన్న మందులను ముందుగా వినియోగించాలని సూచించారు. ఒఆర్ఎస్ ప్యాకెట్ల లభ్యతను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగుల నిమిత్తం తాగునీరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. వడదెబ్బ, వేసవి జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రధాన రహదారి కూడలికి ఆసుపత్రి సమీపంగా ఉన్నందున అత్యవసర, ప్రాథమిక చికిత్స సిద్ధంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం జగన్మోహన్ అక్కడ ఆరోగ్య తనిఖీల కోసం వచ్చే రోగులు, గర్భిణులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకొని తగు సూచనలు చేశారు. వైద్యసిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా కృషి చేయాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారి డాక్టర్ పి.పావని, సూపర్ వైజర్లు సత్యవతి, భవాని, శర్మ, వైద్య సిబ్బంది మురళీ, నిర్మల, వెంకటలక్ష్మి, శ్రీదేవి తదితరులు ఉన్నారు.

కార్మిక సమస్యలు మేనిఫెస్టోలో చేర్చాలి

ప్రజాశక్తి - పాచిపెంట

కార్మిక సమస్యలను ఏ విధంగా పరిష్కరిస్తారో రాజకీయ పార్టీలు వారి వారి మేనిఫెస్టోల్లో చేర్చి ఎన్నికల అనంతరం వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్ వై నాయుడు డిమాండ్ చేశారు. పాచిపెంటలో జరిగిన సిఐటియు సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత పదేళ్లుగా పాలకవర్గాలు కేంద్రంలో, రాష్ట్రంలో కార్మిక సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. దేశంలో 30 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, కోట్లాది ప్రజల సంపద పెట్టుబడుదారులకు దోచిపెట్టే పనిని పాలకవర్గాలు చేశాయని సిఐటియు వీటిపై పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. రాష్ట్రంలో పదేళ్లలో అధికార, ప్రతిపక్షాలు రెండూ నరేంద్ర మోడీకి వంత పాడడమే తప్ప కార్మిక సమస్యలపై నికరంగా నిలబడి పరిష్కరించే పార్టీలకు కార్మికులు అండగా నిలబడాలని, వారికి కార్మిక వర్గం ఎన్నికల్లో అండదండలను ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పార్వతి, బంగారమ్మ, జయ, పైడిరాజు, సుగుణమ్మ, థెరిసా, కార్మికులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రశాంత నిర్వహణకు సహకరించాలి

ప్రజాశక్తి -సీతానగరం

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహణకు ప్రజలు సహకరించాలని ఎస్సై ఎం రాజేష్ కోరారు. మండలంలోని బక్కుపేటలో సోమవారం రాత్రి గ్రామస్తులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ పాటించాలని, ప్రతి ఒక్కరూ ఎటువంటి తగాదాలకు ప్పాల్పడకూడదని సూచించారు. కావున ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు

నేడు పనస నందివాడలో ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని పనసనందివాడలోని ఈనెల 16న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మానస సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

25 మంది రక్తదానం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 25 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. జెమ్స్ ఆసుపత్రి రాగోలు వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరంలో ఐటిఐ విద్యార్థులు, సీతంపేట వైటిసి విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. వీరిని ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ ఎం.గోపాలకృష్ణ అభినందించారు. ఈ కార్యక్రమంలో వైటీసీ స్టాఫ్, జెమ్స్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

పలువురు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - సాలూరు రూరల్

మండలంలోని నెలిపర్తి మాజీ సర్పంచ్ రాపాక అప్పమ్మ, మాజీ వార్డ్ మెంబర్లు విజయ, గంగులు, సతీష్, 20 కుటుంబాలు మండల పార్టీ అధ్యక్షులు ఆముదాల పరమేష్ ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. వీరిని పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా టిడిపి అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ రాష్ట్రాన్ని జగన్‌మోహన్ రెడ్డి 20 ఏళు వెనక్కి వెళ్లేలా చేశారన్నారు. యువత భవిష్యత్తును మెరుగుపడాలన్నా మళ్లీ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉండాలని అందుకోసం ప్రతి ఒక్కరూ ఓటు అనే ఆయుధంతో ఈ జగన్‌మోహన్‌రెడ్డిని గద్దె దింపినప్పుడే బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో గణపతి, బంగారి, లింగాల గాంధీ, సురేష్, మత్స శ్యాం సుందర్, భాస్కర్, శ్రీను, బాలాజీ పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

సాగుదారులకు భూ హక్కు కల్పించాలి

ప్రజాశక్తి - కొమరాడ

తాత, ముత్తాతల నుంచి సాగు చేస్తున్న భూమికి హక్కు కల్పించాలని ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు దుగ్గికి చెందిన రైతులు న్యాయం చేయాలను కోరుతూ స్థానిక తహశీల్దార్ రమేష్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం దాసు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు, సిఐటియు జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ మండలంలోని దుగ్గికి చెందిన 21 మంది రైతులు తమ తాత ముత్తాతల నుంచి 23 ఎకరాలు భూమి చేసుకున్న సందర్భంలో వీరి భూమికి సంబంధించిన పాసుబుక్కులు, 1-బిలు, అడంగల్ ఉన్నప్పటికీ సచివాలయానికి వెళ్లి చూడగా వన్-1, అడంగల్ బ్లాక్లిస్టులో ఉన్న పరిస్థితి ఉందన్నారు. గమనించి ఆశ్చర్యాన్ని గురయ్యే పరిస్థితి ఉందని, ఇలాంటి సందర్భంలో గడిచిన కొన్ని నెలల క్రితం వీరి 1-బి బ్యాక్ లిస్టులో పెట్టడం జరిగిందని, ఇది చాలా అన్యాయమని అన్నారు. ఇలాంటి సందర్భంలో రెవెన్యూ యంత్రాంగంతో పాటు పార్వతీపురంలో కొంతమంది రాజకీయ నాయకులు కుమ్మక్కై ఈ భూ రికార్డులు తారుమారు చేయగా, బాధితులు కోర్టు నుంచి సంబంధిత కాగితాలు తెచ్చుకున్నారన్నారు. అయితే ప్రత్యర్థులు తమ భూములంటూ మంది రైతులను భయపెడుతున్నాం న్నారు. కావున వెంటనే స్థానిక తహశీల్దార్ ఈ భూములపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టి వాస్తవాలు తేల్చి బాధిత రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో దుగ్గి గ్రామానికి చెందిన బాధిత రైతులు పాల్గొన్నారు.

పలుచోట్ల వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి -సాలూరు

జిల్లాలో పలుచోట్ల పెద్ద సంఖ్యలో వాలంటీర్లు తమ రాజీనామాలను సమర్పించారు. ఇందులో భాగంగా సాలూరు మండలంలోని 8 పంచాయతీలకు చెందిన 102 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. ఈ సోమవారం ఎంపిడిఒ ఫణీంద్ర కుమార్‌కు తమ రాజీనామా పత్రాలను అందజేశారు. వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ సమక్షంలో వాలంటీర్లు రాజీనామా చేశారు.

వీరఘట్టం : మండలంలోని దశమంతపురం సచివాలయం పరిధిలో పదిమంది గ్రామ వాలంటీర్లు సోమవారం విధులు నుంచి తప్పుకుంటున్నట్లు సచివాలయ కార్యదర్శి కె.సునీల్ కుమార్ కు రాజీనామా పత్రాలు అందజేశారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని వివిధ పంచాయతీల నుంచి సుమారు 60 మంది గ్రామ వాలంటీర్లు రాజీనామాలు సమర్పించారని ఎంపిడిఒ జి.జగదీష్ కుమార్ తెలిపారు. ఇరిడి సచివాలయం, పెద్దఖర్జ పంచాయతీలో 12మంది, చిన్న గీశాడలో 6, తాడికొండలో ఇద్దరు, డుమ్మంగి పంచాయతీలో 6, చెముడుగూడలో 12 , బీరుపాడులో 10, బాలేసులో పదిమంది చొప్పున గ్రామ వాలంటీర్లు రాజీనామాను సమర్పించారని తెలిపారు. ఈ రాజీనామాలను ఆమోదించామని తెలిపారు.

భామిని: మండలంలోని లివిరి సచివాలయం పరిధిలో 20 మంది, నులకజోడు సచివాలయం పరిధిలో 9 మంది గ్రామ వాలంటీర్లు తమ రాజీ నామ పత్రాలను పంచాయతీ కార్యదర్శి విశ్వేశ్వరావుకు సోమవారం అందజేశారు.

24మంది వాలంటీర్ల సస్పెన్షన్

పార్వతీపురం రూరల్ : స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తూ సమావేశమైన 24 మంది వాలంటీర్లను సోమవారం ఎంపిడిఒ అకిబ్ జావేద్ సస్పెండ్ చేసినట్లుగా తెలిపారు. నర్సిపురానికి చెందిన 11 మంది, పెద్ద బొండపల్లి 13 మంది ఉన్నారన్నారు. అలాగే నరిసిపురం 1-2 సచివాలయాల పరిధిలోని 25 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు.

పార్వతీపురం టౌన్ : స్థానిక మున్సిపల్ పరిధిలో ఉన్న సచివాలయాల్లో 20మంది వార్డు వాలంటీర్లు తమ విధులకు రాజీనామాను మున్సిపల్ కార్యాలయానికి అందజేశారు. వీరి నుంచి మొబైల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ తెలిపారు.

వైసిపి మండల కన్వీనర్ మృతి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

వైసిపి మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు అకాల మృతితో మండలంలోని వైసిఎం కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన గురయ్యారు. గత కొంతకాలంగా శంకర్రావు అనారోగ్యంతో విశాఖ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన మృతి పట్ల కురుపాం ఎమ్మెల్యే పాములు పుష్ప శ్రీవాణి, వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజులు తీవ్ర మనస్థాపానికి గురై కంటతడి పెట్టారు. శంకర్రావు లేని లోటు తీర్చలేనిదన్నారు. చివరిసారిగా శంకర్రావు మృతదేహాన్ని చూసేందుకు మండలంలో వందల మంది ఆయన అభిమానులు తరలివచ్చారు. మృతి చెందిన శంకర్రావు భార్య శశికళ జెడ్‌పిటిసిగా పనిచేస్తున్నారు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

అగ్ని ప్రమాదాలను నివారించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

అగ్నిప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అగ్నిమాపక అధికారి పైడిరాజు అన్నారు. సోమవారం పార్వతీపురంలోని అగ్నిమాపక కేంద్రం వద్ద నిర్వహించిన వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అగ్నిప్రమాదాల నివారణలో ఎంతో మంది జవానులు అశువులు బాశారన్నారు. వంట గ్యాస్ వినియోగం, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ విషయంలో అవగాహన అవసరం ఉందన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - సాలూరు

తమ వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షుడు టి.రాముడు, కార్యదర్శి టి.శంకరరావు ఆధ్వర్యాన కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన వేతనాలను చెల్లించడంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఇదే వైఖరి కొనసాగితే ఏ క్షణమైనా నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్నెనాయుడు మాట్లాడుతూ మూడు నెలలుగా వేతనాలందకపోతే కార్మికులు ఎలా జీవనం సాగిస్తారని ప్రశ్నించారు. వేతనాలు మంజూరుకు వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకపోతే డిఎంఎ దృష్టికి సమస్య తీసుకెళ్తామని చెప్పారు. అనంతరం మేనేజర్ రాఘవాచార్యులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా కన్వీనర్ టి.ఇందు పాల్గొన్నారు.

పాలకొండలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

పాలకొండ : జీవో 36 ప్రకారం కొత్త జీతాలు, బకాయి జీతాలు సమ్మె కాలపు జీతం రూ.వెయ్యి కానుక, యూనిఫారం కుట్టుకూలి మంజూరు తదితర సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం కమిషనర్‌కు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పాలకొండ కమిటీ గౌరవ అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ మున్సిపల్ అధికార యంత్రాంగం నిర్లక్ష్యం విడనాడాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పాలకవర్గం మున్సిపల్ కమిషనర్ సమక్షంలో జరిగిన సమస్యలు నేటికీ పరిష్కారం చేయకపోవడం అధికారులు నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే సిబ్బంది యావన్మంది సామూహిక సెలవులు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ సురేష్, సిహెచ్ సంజీవి, సిహెచ్ కార్తీక్, విమల, శ్రీదేవి, రఘు, భాస్కర్, మధు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

రెగ్యులరైజేషన్‌లో ముడుపులపై విచారణ

- సూపరింటెండెంట్‌కు స్థానచలనం
- గిరిజన సంక్షేమ డిడికి ఛార్జి మెమో జారీ
- ప్రజాశక్తి తో ఐటిడిఎ పిఒ

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన సంక్షేమ శాఖలో సిఆర్‌టిల రెగ్యులరైజేషన్ ప్రక్రియకు సంబంధించి ముడుపులు వసూలు చేయడంపై విచారణకు ఆదేశించినట్లు ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ చెప్పారు. సోమవారం ఆయన స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రజాశక్తితో మాట్లాడుతూ సిఆర్‌టిల రెగ్యులరైజేషన్ లో ముడుపులు తీసుకున్నట్లు తన దృష్టికి వచ్చిందని చెప్పారు. విచారణ జరుగుతోందన్నారు. ఈ మేరకు కార్యాలయం సూపరింటెండెంట్ రెడ్డిని ఎన్నికల సెల్‌కు మార్చినట్లు తెలిపారు. ఈ వ్యవహారం లో ఆరోపణలు ఎదుర్కొంటున్న గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండరావుకు ఛార్జి మెమో జారీ చేశామని చెప్పారు. దీనిపై ఆయన వివరణ చూసిన తర్వాత చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొంతమంది సిఆర్‌టిలను విచారించామని, వారు మౌఖికంగా చెపుతున్నారు కానీ రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడం లేదని అన్నారు. ఎన్నికల విధుల్లో వున్నందున పూర్తి స్థాయిలో విచారణపై దృష్టి సారించలేక పోతున్నట్లు చెప్పారు. నెలరోజుల్లో విచారణ పూర్తి చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ చెప్పారు.

52 మంది వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో పలు డివిజన్లకు సంబంధించిన 52 మంది వాలంటీర్లు రాజీనామాలు చేశారు. ఈ మేరకు తమ రాజీనామా లేఖలను సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడుకు అందజేశారు. 2వ డివిజన్ నుంచి 16 మంది, 12 వ డివిజన్ నుంచి 10 మంది, 47 వ డివిజన్ నుంచి 12 మంది, 41వ డివిజన్ నుంచి 14 మంది మొత్తంగా 52 మంది వాలంటీర్లు రాజీనామాలు చేశారు. రాజీనామా చేసిన సందర్భంగా సుజాత అనే వాలంటీర్ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా సేవా దక్పథంతో ప్రజలకు సేవ చేసామని అన్నారు. అందుకు ప్రతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గౌరవ వేతనాన్ని కూడా అందజేశారన్నారు. అయితే తాము ప్రజలకు అందిస్తున్న మెరుగైన సేవలను చూసి ఇతర రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తులు చులకన చేస్తూ, ఎగతాళిగా మాట్లాడడం వలన తాము తీవ్ర మనస్థాపానికి గురై స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తున్నామని చెప్పారు.

24న అదితి గజపతి నామినేషన్

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం నియోజకవర్గం టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు ఈనెల 24న నామినేషన్ వేయనున్నారని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, నాయకులు తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ 24వ తేదీ ఉదయం 8 గంటలకు కోట జంక్షన్ నుండి భారీ ఊరేగింపుగా బయలుదేరి మూడులాంతర్లు, గంటస్తంభం, కన్యకాపరమేశ్వరి కోవెల మీదుగా పాత మహారాజ ఆసుపత్రి జంక్షన్ వరకు వెళ్తామని తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో 10.30 గంటలకు నామినేషన్ పత్రాలను సమర్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజు, జిల్లా పెద్దలు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో టిడిపి నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, పట్టణ నాయకులు పిల్లా విజయ్ కుమార్, నాయకులు కళ్ల గౌరీశంకర్, గాడు అప్పారావు పాల్గొన్నారు.

నవయుగ వైతాళికుడు కందుకూరి

ప్రజాశక్తి-విజయనగరం కోట

నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులని శ్రీనివాస్ ఆర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి ఆర్‌బి రామానాయుడు, నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు అన్నారు. సోమవారం స్థానిక నారాయణ పబ్లిక్ స్కూల్లో కందుకూరి వీరేశలింగం పంతులు 176వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రామా నాయుడు విద్యార్థులు వీరేశలింగం వేష ధారణ తో అలరించారు.

వీరేశలింగం వేషధారణతో రామానాయుడు, విద్యార్థులు

అత్యవసర సేవల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్

ప్రజాశక్తి-విజయనగరం

పోస్టల్ బ్యాలెట్ కోసం అత్యవసర సేవలందిస్తున్న శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగుల, ఎన్నికల విధులలో పాల్గొంటున్న పాస్‌లు పొందిన మీడియావారికి ఓటింగ్ కోసం పోస్టల్ బాలెట్ ను అందించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అత్యవసర సేవలను అందించే అధికారులతో కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ 33 శాఖల ను అత్యవసర శాఖలు గా గుర్తించి వారికి పోస్టల్ బాలెట్ ను ఇవ్వాలని నోటిపై చేసినట్లు తెలిపారు. వీరు పోస్టల్ బాలెట్ కోసం ఫారం -డి ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఎయిర్‌పోర్ట్ అధారిటీ అఫ్ ఇండియా, ఫుడ్ కార్పోరేషన్ అఫ్ ఇండియా, ఇండియన్ రైల్వే, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, దూరదర్శన్, ఆలిండియా రేడియో, ఎలక్ట్రిసిటీ, హెల్త్ అండ్ ఫామిలీ వెల్ఫేర్, స్టేట్ ట్రాన్స్‌పోర్టు కార్పోరేషన్, ఫుడ్ అండ్ సివిల్ సప్లయి, బిఎస్ఎన్ఎల్, పోలింగ్ రోజున ప్రెస్ కవరేజ్ చేయడానికి ఎన్నికల కమిషన్ జారీ చేసిన అధారిటీ లెటర్స్ కలిగి ఉన్న పాత్రికేయులు, ఫైర్ సేవలు అందిస్తున్న వారికి వర్తిస్తుందని తెలిపారు. ఆయా శాఖల అధికారులు పోస్టల్ బాలెట్ కోసం సిబ్బంది వివరాలను మంగళవారంలోగా అందజేయాలని తెలిపారు. మే 8,9,10 తేదీలలో ఓటు చేయవలసి ఉంటుందని తెలిపారు. ఒక సారి ఫారం డి తీసుకున్న వారికి పోస్టల్ బాలెట్ ద్వారా తప్ప పోలింగ్ స్టేషన్ లో ఓటు వేసే అవకాశం ఉండదని స్పష్టం చేసారు. సమావేశం లో జాయింట కలెక్టర్ కార్తీక్, డిఆర్ఓ అనిత, అత్యవసర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నియోజకవర్గాలకు ఇవిఎంల తరలింపు

నెల్లిమర్ల : స్థానిక ఇవిఎం గోదాము నుంచి నియోజకవర్గ కేంద్రాలకు ఇవిఎంల తరలింపు ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి సోమవారం తనిఖీ చేసారు. ర్యాండమైజేషన్ ద్వారా ఇవిఎంలను నియోజక వర్గాలకు కేటాయించిన విషయం తెలిసిందే. సీరియల్ నంబర్ల ప్రకారం, వాటిని ఆయా నియోజకవర్గాల వారీగా వేరుచేసి స్ట్రాంగ్ రూమ్ లకు తరలించారు. ఇవిఎంల నోడల్ ఆఫీసర్ బి.ఉమాశంకర్, డిఆర్‌డిఎ పీడీ ఎ.కళ్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-గజపతినగరం

పురిటి పెంట గ్రామంలోని న్యూకాలనీ, మారుతీనగర్ కాలనీలో టిడిపి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి, జనసేన ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వం ఏర్పడాలని అన్నారు. ప్రస్తుత ఈ అసమర్ధ వైకాపా ప్రభుత్వం సంపద సష్టించలేకపోయిందని, ఈ ఐదేళ్ళు అరాచకం, విధ్వంసం చేయడం పాలనగా సాగించిందని అన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా కలిశెట్టి అప్పలనాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అట్టాడ లక్ష్మునాయుడు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు మక్కువ శ్రీధర్, మాజీ ఎంపిపి గంట్యాడ శ్రీదేవి, ప్రదీప్‌కుమార్, పివి గోపాలరాజు, గొర్లె బంగారునాయుడు, మంత్రి త్రినాధరావు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.


ఓటర్లకు సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తున్న శ్రీనివాస్

ఆప్కాస్ కార్మికులకు జీతాలు చెల్లించాలి

అసిస్టెంట్ కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం నగర పాలక సంస్థలో పనిచేస్తున్న క్లీన్ ఎన్విరాన్‌మెంటల్ వర్కర్లకు, ఇంజినీరింగ్ తదితర విభాగాల్లో ఉన్న ఆప్కాస్ కార్మికులందరికీ మార్చి నెల వేతనం నేటికీ మంజూరు కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, తక్షణమే జీతాలు చెల్లించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అసిస్టెంట్ కమిషనర్‌కు .సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ. జగన్మోహన్‌రావు మాట్లాడుతూ మార్చి నెల వేతనం నేటికీ చెల్లించకపోవడంతో బ్యాంకు లోన్లు, నెలవారీ అప్పులకు అధిక వడ్డీలు కార్మికులు చెల్లించాల్సి వచ్చిందన్నారు. కార్పొరేషన్ పరిధిలో కార్మికులకు సమ్మె కాలపు జీతంతో పాటు, 2022, 2023 సంవత్సరాల్లో ఒక్కొక్కరికి రూ.12వేలు చొప్పున హెల్త్ అలవెన్స్ బకాయిలు ఉన్నాయని తక్షణమే వాటిని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అసిస్టెంట్ కమిషనర్‌ను కలిసిన వారిలో మున్సిపల్ యూనియన్ నాయకులు రామచంద్రరావు ,శంకర్రావు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల ధర్నా

ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి- కొత్తవలస

తమకు గిట్టుబాటు కూలి కల్పించాలని కోరుతూ ఉపాధి కూలీలు సోమవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గొర్లె శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు అరకొర, చాలీచాలని వేతనాలు పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కొక్క కార్మికుడికి రోజు కూలి 51 రూపాయలు, మరికొన్ని గ్రూపులకు రూ.81, రూ.91 రూ.101 వస్తుంటే కుటుంబాలను ఎలా పోషించాలని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు రోజు కూలి రూ.300 తగ్గకున్నా ఇవ్వాలని ప్రకటన చేసిందని, ఈ ప్రకటనలు కాగితాలకు మాత్రమే పరిమితమయ్యాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేయడానికి వేస్తున్న కుట్రలోభాగమే నని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకపోవడం వలన నిరుద్యోగులకు వేరే ఉపాధి లేక ఉపాధి హామీ పనులకు కూలీలుగా మారుతున్నారన్నారు. సిపిఎం పాలిస్తున్న కేరళ రాష్ట్రంలో ఉపాధి కూలీకి రోజుకు రూ. 400 ఇస్తుందని, అలాగే మన రాష్ట్రంలో కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులు సంవత్సరంలో ఒక్కొక్క జాబ్ కార్డుకి 200 రోజులు పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉపాధి కూలీలకు పాత పద్ధతి మాదిరిగానే పనులు చేపట్టాలని 20 మందికి ఒక గ్రూపు ఏర్పాటు చేయాలని, పని ప్రదేశాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, పనిముట్లకు అదనపు అలవెన్స్ ఇవ్వాలని, సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని కోరారు. మండుతున్న ఎండలను గమనించి మజ్జిగ సరఫరా చేయాలని, చేసిన పనికి పే స్లిప్పులు ఇవ్వాలని, ప్రతి గ్రూప్‌కి టెంట్లు గుణపాలు పారలు ప్రభుత్వ సరఫరా చేయాలనీ డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ఎక్కువ కేటాయించి ఉపాధి హామీ చట్టంలో నిధులను దారి మళ్లించుకున్న చేయాలని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రామకృష్ణ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కార్యదర్శిపై విచారణకు ఆదేశం

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని గునుపూరుపేట పంచాయతీ కార్యదర్శి బి. లక్ష్మణరావు ఎన్నికల కోడ్ ఉల్లంఘించి బిఎస్‌పి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంపై ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి స్పందించిన ఆర్ఒ కార్యదర్శిపై సోమవారం విచారణకు ఆదేశించారు. విచారణ చేసి వెంటనే నివేదిక తనకు అందించాలని ఎంపిడిఒకు ఆదేశించారు. విచారణ అధికారిగా ఇఒపిఆర్‌డి శంకర్ జగన్నాథంను వేశారు. ఆయన గ్రామ కార్యదర్శికి నోటీస్ ఇచ్చి వివరణ కోరారు. అనంతరం గునుపూరుపేటలో విచారణ చేపట్టారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు ఇస్తామని ఆయన స్పష్టం చేశారు.

96 మంది వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలో బొప్పడాం, చంద్రంపేట, గుషిణి, జోగిరాజు పేట, కొండ గుంపాం, మొయిద, ఒమ్మి, రామతీర్థం, సతివాడ, వల్లూరు గ్రామాలకు చెందిన 96 మంది వాలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలు ఎంపిడిఒకు అందజేసినట్లు కార్యాలయం సిబ్బంది తెలిపారు. దీంతో బాటు నగర పంచాయతీకి చెందిన వార్డు వాలంటీర్లు రాజీనామాలు అందజేశారు.

మెరక ముడిదాం: మండలంలోని బైరిపురం సచివాలయ పరిధిలో 7గురు వాలంటీర్లు తమ విధులకు రాజీనామా చేసినట్లు సెక్రటరీ దామోదర్ తెలిపారు. రాజీనామా చేసిన వాలంటీర్లు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ చంద్రబాబు మాటలకు మనస్థాపానికి గురై రాజీనామాలు చేశామన్నారు.

భోగాపురం: మండలంలోని మూడు సచివాలయాల పరిధిలో 56 మంది వాలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. భోగాపురం సచివాలయం పరిధిలో 56 మంది వాలంటీర్లు ఉండగా ఇందులో 25 మంది మాత్రమే రాజీనామా చేశారు. పోలిపల్లి సచివాలయం పరిధిలో 16 మంది, ముక్కాం సచివాలయం పరిధిలో 15 మంది వాలంటీర్లు రాజీనామాలు చేశారు. తమ రాజీనామా పత్రాలను ఆయా పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు.

నేడు ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి- విజయనగరం

స్థానిక శ్రీసాయి సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిలో మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నామని ఆ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ఎ. శ్రీరామ్మూర్తి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఈ శిబిరం నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ శిబిరంలో ఉచిత కన్సల్టేషన్, ఎక్స్‌రే, రక్తపరీక్షలు, వైద్య పరీక్షలు నిర్వహిస్తామని ఈ అవకాశాన్ని రోగులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

నేడు రాజా కళాశాలలో ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక రాజా కళాశాలలో మంగళవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సిహెచ్ వీరేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సింధు హాస్పిటల్స్, హెటిరో సంస్థలు ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు జరుగుతాయని చెప్పారు. 2020-21, 2021-22, 2022-23, 2023-24లో డిగ్రీ బిఎస్సి కెమిస్ట్రీ, బిఎ, బికామ్, ఎమ్మెస్సి కెమిస్ట్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పూర్తి వివరాలు, సర్టిఫికేట్స్, ఆధార్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు.

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి నుంచి కలప అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుంది. కలప అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అటవీశాఖ అధికారులు మామూళ్ల మత్తులో ఉన్నారు. కలప అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లను ప్రశ్నించగా అధికారులకు డబ్బులు ఇచ్చినట్లు చెప్పడం విశేషం. రైతులు అవసరాలకు చెట్లు కొడితే అభ్యంతరం చేస్తున్న అటవీశాఖ అధికారులు వ్యాపారులను ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి కలప అక్రమ రవాణాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాక్టర్ల ద్వారా తరలిపోతున్న కలప

అగ్ని ప్రమాదాలపై అవగాహన

గజపతినగరం: కరపత్రాలను పంపిణీ చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - గజపతినగరం

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎంఎస్‌వి రవి ప్రసాద్ రైల్వే స్టేషన్, ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. నాలుగు రోడ్ల జంక్షన్ వంటి ప్రధానమైన ప్రదేశాలలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఏ విధంగా స్పందించాలి, మంటలను ఏ విధంగా అదుపు చేయాలి అనే వాటిపై ప్రయోగాత్మకంగా అగ్నిమాపక సాధనాలతో అవగాహన వచ్చే విధంగా అందరికీ చేసి చూపించారు. అనంతరం కరపత్రాలను పంచారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

శృంగవరపుకోట: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని పట్టణం లోని అగ్నిమాపక దళ శాఖాధికారి షేక్ మదీనా అన్నారు. రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ జాతీయ అగ్గిమాపక వారోత్సవాలులో భాగంగా రెండవ రోజు పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో డిపో మేనేజర్ కె రమేష్ ఆధ్వర్యంలో ఆర్‌టిసి సిబ్బందికి, ప్రయాణికులకు అగ్నిప్రమాదాలు సంభవించునపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, నివారణ పద్ధతులు గురించి వివరించారు. ఫైర్ డ్రిల్స్ నిర్వహించి అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ కోట ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామాలయానికి తలంబ్రాలు అందజేత

తలంబ్రాలను అర్చకులకు అందిస్తున్న సంఘం ప్రతినిధులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఈ నెల 17న శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణం పురస్కరించుకొని కళ్యాణార్థం నిర్వహించే శ్రీ రామతీర్థం సేవా సంఘం ఆధ్వర్యంలో గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను సోమవారం శ్రీరామునికి సమర్పించారు. ఈ సంవత్సరం కూడా ఈ సంఘం ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే కాకుండా తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన రామభక్తులకు ఈ తలంబ్రాలను పంపించారు. ఆ ధాన్యాన్ని భక్తులు శ్రీ రామనామం జపిస్తూ గోటితో ఒలుస్తూ అవి తలంబ్రాలుగా సిద్ధం చేసి సంఘ ప్రతినిధులకు అందజేశారు. దుప్పాడ, నెల్లిమర్ల, తంగుడుబిల్లి గ్రామాలకు చెందిన యాత్రికులు తయారు చేసిన తలంబ్రాలను, భీమవరానికి చెందిన మునకాల గోవింద రావు పంపిన కంత (మధుర పదార్థము)ను రామతీర్థంలోని రామచంద్రస్వామికి మేళతాళాలతో, భజనలతో, కోలాటాలతో కోలాహలంగా ఊరేగింపుగా తీసుకుని వచ్చి దేవస్థానం కార్యనిర్వహణాధికారి, సహాయ కమీషనర్ వై శ్రీనివాసరావుకి సంఘం ప్రతినిధులు, అర్చకస్వాముల సమక్షంలో సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

బొబ్బిలి: మాట్లాడుతున్న ఆర్ఒ సాయిశ్రీ

ప్రజాశక్తి- బొబ్బిలి

ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. సాయిశ్రీ అన్నారు. గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ పాఠశాలలో జరుగుతున్న పిఒ, ఎపిఒ శిక్షణలో ఆమె మాట్లాడారు. జాగ్రత్తలు పాటిస్తే ఎన్నికలు విజయవంతంగా నిర్వహించవచ్చునన్నారు. ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహశీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పగడ్బందీ చర్యలు

గజపతినగరం: త్వరలో జరగనున్న ఎన్నికల నిర్వహణకు పగడ్బందీగా చర్యలు చేపట్టనున్నట్లు విజయనగరం ఆర్‌డిఒ, నియోజవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిని ఎం.వి. సూర్యకళ అన్నారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, ఇప్పటికే ఎన్నికల ప్రక్రియకు సంబంధించి పనులు క్రమంగా చేపడుతున్నామన్నారు. సెక్టోరియల్ ఆఫీసర్స్, పిఒలు, ఎపిఒలకు ఇప్పటికే రెండు విడుదలగా శిక్షణా తరగతులు నిర్వహించామన్నారు. ఈనెల 18వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ చేపడతామన్నారు. 26న నామినేషన్ల స్క్రూటిని ఉంటుందన్నారు. 29వరకు నామినేషన్ ఉపసంహరణకు గడువు ఉంటుందన్నారు. అభ్యర్థులు నాలుగు సెట్ల అఫిడవిట్లు దాఖలు చేయవచ్చున్నారు. నామినేషన్ల దరఖాస్తులకు సంబంధించి ఎటువంటి సందేహాలున్నా తహశీల్దార్ కార్యాలయంలో గల హెల్ప్ డెస్క్‌కు వచ్చి నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి రెండు కేసులు ఇప్పటివరకు నమోదు చేసినట్లు తెలిపారు. వికలాంగులు, 85 సంవత్సరాల దాటిన ఓటర్ల ఇంటికి వెళ్లి ఓటు వేయించే సౌకర్యం కల్పించినట్లు అన్నారు. ఇందుకు సంబంధించిన సిబ్బందిని కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు కావలసిన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించి ప్రక్రియ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ పి రమేష్, ఉప తహశీల్దార్ సత్యనారాయణ పాల్గొన్నారు.

19న కౌన్సిలింగ్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మిగులు సీట్లు భర్తీకి ఈ నెల 19న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్స్‌పాల్ కె.ఉషారాణి తెలిపారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 2024-2025 విద్యా సంవత్సరంకి 5వ తరగతి ప్రవేశానికి ప్రవేశ పరీక్ష రాసి ఎంపిక కాబడిన విద్యార్థులకు మొదటి లిస్టులో సీట్లు కేటాయించగా ఇంకను మిగిలి ఉన్న సీట్లకు ఎంట్రెన్స్ పరీక్ష రాసిన విద్యార్థినులకు మెరిట్ లిస్టు ప్రకారం మిగులు సీట్లు కేటాయిస్తామన్నారు. ఈ నెల 19 న చీపురుపల్లి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల యందు ఉదయం 10 గంటల నుండి కౌన్సిలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తామని చెప్పారు. కౌన్సెలింగ్‌కి విద్యార్థిని తమ ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ, ఆదాయ ధృవీకరణపత్రం, స్టడీస్ సర్టిఫికెట్స్‌తో చీపురుపల్లి పాఠశాలకు ఉదయం 9.గంటలకు హాజరు కావాలని ఆమె తెలిపారు.

ఉపకరణాల ఎంపిక శిబిరానికి స్పందన

శిబిరాన్ని పరిశీలిస్తున్న సూర్యారావు, తిరుమల ప్రసాద్

ప్రజాశక్తి - రామభద్రపురం

స్థానిక భవిత కేంద్రంలో సోమవారం బొబ్బిలి నియోజకవర్గ స్థాయిలో వికలాంగ చిన్నారులకు ఉపకరణాల ఎంపికకు నిర్వహించిన నిర్ధారణ శిబిరానికి విశేష స్పందన లభించింది. బొబ్బిలి, తెర్లాం, బాడంగి, రామభద్రపురం మండలాలకు చెందిన 18 ఏళ్లలోపు వికలాంగులు 150 మందికి పైగా ఈ శిబిరానికి హాజరయ్యారు. వీరికి సరిపడా ఉపకరణాలైన వీల్ ఛైర్లు, రోలేటర్స్, ట్రైసైకిల్, ఎంఆర్ కిట్లకు ఆర్థో వైద్యులు నాగిరెడ్డి రవిశంకర్, ఇఎన్‌టి వైద్యులు హిప్పిజా తనిఖీలు చేసి అర్హతలు నమోదు చేసి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా సహిత విద్యా సమన్వయకర్త సూర్యారావు, ఎంఇఒ తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ విరలాంగులైన చిన్నారులకు సమగ్రశిక్షలో విద్యతో పాటు ఎస్కార్ట్ రవాణా, స్టైఫండు, ఇంటి వద్దనే విద్య, రీడర్ అలవెన్స్ ఇవ్వటంతో పాటు అలెమ్కో కాన్పూర్ వారిచే ఉపకరణాలను ప్రతీ ఏడాది అందించటం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు కొల్లి ఈశ్వరరావు, సునీల్, పాపారావు, కళావతి, శ్రీను, ఐఇఆర్‌టిలు చింతల రాజేశ్వరి, రవి, తేజస్విని, సూర్య, సత్య, సరిత పాల్గొన్నారు.